@vaartanews @mvnewstv
మన వార్త
AP EDITION
www.mivaartanews.com
TGBIL/25/A0512
విజయవాడ
ప్రతి అక్షరం... ప్రజల కోసం
శనివారం 17 అక్టోబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది



# పిల్లల సోషల్ మీడియా భద్రత

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్టమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన
- తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

# అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించా



- దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రిని సందర్శించారు
- భక్తుల కేరింతలకు సీఎం స్పందించి వారికి ఆత్మీయంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు.
- ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు
- ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు

# స్థానిక సమరానికి టీడీపీ సై

- అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం
- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం
- సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత
- మేయర్లు, ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ
- ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి - మిగతా3లో



# కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

- కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్
- ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదు



# ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్
- అభిజిత్ దిప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారు
- ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య



# బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర

- రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు
- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలపై రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- అధికారం కోసమే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు

# రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు



- ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ, వైసీపీ
- స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ రాయలసీమలో ఘర్షణలు
- దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు పాల్పడ్డారని ఆరోపణ
- టీడీపీ నాయకులే దాడులకు పాల్పడ్డారని వైసీపీ నేతలు

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాయలసీమలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ, ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ టీడీపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు శుక్రవారం ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. రాయలసీమలోని పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతి - మిగతా3లో



# అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

- మోదీ కోరుకుంటే నేనే వివరిస్తా
- అమెరికా మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రూబియో ముంబయిలో భారత అధికారులతో సమావేశం
- కానున్న నేపథ్యంలో విదేశాంగ శాఖలోనే గందరగోళం నెలకొంది

# పిల్లల సోషల్ మీడియా భద్రత



సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

# కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి



కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిపై ఖర్గే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గతంలో చేసిన విధంగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేసుకునే ప్రయత్నం మరోసారి చేయొద్దని ప్రధానిని కోరారు. ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదని లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనుందని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఖర్గే లేఖ రాసినట్లు తెలుస్తోంది. "డీలిమిటేషన్‌పై ఏ రాజ్యాంగ సవరణ బిల్లునైనా తీసుకురావడానికి ముందు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేను మీకు ఏప్రిల్ 11న మొదటిసారిగా లేఖ రాశాను. కానీ, మీరు అలా చేయలేదు. ఆ తర్వాత ఏప్రిల్ 14న అర్ధరాత్రి దాటిన తర్వాత మీరు బిల్లులను బయటపెట్టి ఏప్రిల్ 16న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో డీలిమిటేషన్‌పై రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఆ తర్వాత జూలై 16, ఆగస్టు 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ మళ్లీ లేఖ రాశాను. ఇప్పుడు నేను నాల్గోసారి ఇలా రాస్తున్నాను. పార్లమెంటులో డీలిమిటేషన్‌పై కొత్త ప్రతిపాదనలను ఖరారు చేయడానికి ముందు వాటిపై సవివరంగా చర్చించడానికి దయచేసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయండి. అన్ని రాజకీయ పార్టీలకు తమలో తాము, ఒకరితో మరొకరు, ఇతర భాగస్వాములందరితో చర్చించుకోవడానికి తగినంత సమయం ఉండాలి. గతంలో మీరు చేసినట్లుగా రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేయడానికి మళ్లీ ప్రయత్నించవద్దు."

**నెలాఖరులో బిల్లులు పెట్టే అవకాశం**

ఇదిలా ఉండగా, ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అనేక వార్తలు వెలువడుతున్నా, అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అటు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వివాదం, సీజేపీ ఆందోళనల వల్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు ప్రత్యేక సమావేశాల్లో బిల్లులను ఆమోదించుకోవాలని భావిస్తోంది. అయితే, సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ ఈ బిల్లులు చర్చకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఒక రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం ఉంటుంది. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల సంఖ్యాబలం (సుమారు 360 సీట్లు) వారికి లేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ బలం కాస్త పెరిగింది. ఈ బిల్లులకు మరింత మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డీఎంకే (ఐవీఖ) సహా పలు చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# అయోమయంలో భారత విదేశాంగ అధికారులు




అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశం కానున్న విషయంపై విదేశాంగ శాఖ అధికారులకే స్పష్టత లేదని విమర్శించారు. ఆ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలని అన్నారు. ఒకవేళ మోదీ కోరుకుంటే తానే వివరిస్తానంటూ ఎక్స్‌లో వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇటీవల రూబియో పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించిన నేపథ్యంలో రాహుల్ పలు వ్యాఖ్యలు చేశారు. వచ్చే వారం ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో రూబియో సమావేశమవుతారని, ఆ భేటీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని భావిస్తున్నట్లు గోర్ తెలిపారు. దీనిపై స్పందించిన రాహుల్, భారత విదేశాంగ శాఖలోనే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందంటూ కేంద్రంపై తాజాగా విమర్శలు గుప్పించారు.

**'అధికారులంతా అయోమయంలోనే!'**

మార్కో రూబియో తన ఉద్యోగిని ముంబయికి పిలిపించుకున్నారంటూ రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. విదేశాంగ శాఖలోని అధికారులు ఏం జరుగుతుందో తెలియక అయోమయంలో ఉన్నారని ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆ విషయం గురించి మోదీ వివరించాల్సి ఉంటుందని, లేదంటే తానే వివరించాల్సి వస్తుందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎద్దేవా చేశారు రాహుల్ గాంధీ.

**'గోర్ ఎందుకు వెల్లడిస్తున్నారు?'**

అయితే రూబియో పర్యటనపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో రూబియో భేటీ గురించి అమెరికా రాయబారి వివరాలు వెల్లడించడంపై అభ్యంతరం తెలిపింది. ఇలాంటి విషయాలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించాల్సి ఉండగా, అమెరికా రాయబారి ఎందుకు వెల్లడిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత విదేశాంగ మంత్రి దేశంలో నిర్వహించే సమావేశాల వివరాలను ఇతరులు ప్రకటించడం అసాధారణమని ఆయన వ్యాఖ్యానించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులను కలుస్తారని చెప్పడం ఒకటైతే, ఆ సమావేశానికి జైశంకర్ కూడా వస్తారని అమెరికా రాయబారి ప్రకటించడం మరో విషయమని పేర్కొన్నారు.

**అక్టోబర్ 17 నుంచి 22 వరకు పర్యటన**

బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరంలో జరిగిన చర్చ సందర్భంగా గోర్ ఆ వివరాలను వెల్లడించారు. రూబియో ముంబయిలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశమవుతారని, దిల్లీ నుంచి మరికొందరు అధికారులు కూడా అక్కడికి వస్తారని చెప్పారు. జైశంకర్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆ ప్రకటనే ఇప్పుడు కాంగ్రెస్ విమర్శలకు కారణమైంది. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, రూబియో అక్టోబర్ 17-22 వరకు ఉజ్బెకిస్థాన్, భారత్‌లో పర్యటించనున్నారు.

తొలుత ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌కు వెళ్లి, అక్కడ సెంట్రల్ ఆసియా దేశాలతో జరిగే సీ5+1 మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత్‌కు వచ్చి ముంబయి, గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో పర్యటిస్తారు. భారత్‌లో పర్యటన సందర్భంగా సీనియర్ ప్రభుత్వ అధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించనున్నారు. ఇంధన రంగంలో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలపైనా చర్చలు జరపనున్నారు. వ్యాపార రంగానికి చెందిన ప్రముఖులతోనూ రూబియో సమావేశమై వాణిజ్యం, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడనున్నారు.

**వాణిజ్యం, ఇంధన రంగాలపై దృష్టి**

రూబియో పర్యటన రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా వ్యాపార సంబంధాలపైనా ప్రధానంగా దృష్టి పెట్టనుంది. భారత్- అమెరికా మధ్య వాణిజ్యం, ఇంధన సహకారం, సాంకేతిక రంగంలో భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాలు ఆ పర్యటనలో కీలకంగా ఉండనున్నాయి. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలను మరింత విస్తరించడం వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది మే 23 నుంచి 26 వరకు రూబియో భారత్‌లో పర్యటించారు. ఇప్పుడు ఆయన చేపట్టనున్న పర్యటన ఈ ఏడాదిలో రెండో అధికారిక పర్యటన కానుంది.

# రోజుకు రూ. 200 కోట్ల నష్టం..
# కన్నాట్ ప్లేస్ బంద్‌పై వ్యాపారుల ఆవేదన



'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ప్రతిపాదించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన కార్యక్రమం కారణంగా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సెంట్రల్ పార్క్‌ను మూసివేయడాన్ని వ్యతిరేకిస్తూ వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే, ఈ మూసివేత వల్ల చిన్న వ్యాపారులపై పడే ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామంతో తమకు రోజుకు సుమారు రూ. 200 కోట్ల నష్టం వాటిల్లుతోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫున న్యాయవాది జై అనంత్ దేహ్రాద్రాయ్.. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ముందు నేడు వాదనలు వినిపించారు. న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) అర్ధరాత్రి వేళ పార్క్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసిందని, పండగ సీజన్‌లో ఈ నిర్ణయం వల్ల వ్యాపార కార్యకలాపాలు స్తంభించిపోయి, తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీజేఐ సూర్యకాంత్.. "ఈ విషయంలో సంబంధిత వర్గాలన్నింటిలోనూ మంచి ఆలోచన వస్తుందని మేము ఆశిస్తున్నాము. పండగ రోజుల్లో చిన్న దుకాణదారులు తమ జీవనోపాధిని ఎలా సంపాదించుకుంటారో మాకు తెలుసు. వారి కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయి" అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో జస్టిస్ బాగ్చీ జోక్యం చేసుకుంటూ.. నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ, వ్యాపారం చేసుకునే హక్కు పరస్పరం ముడిపడి ఉంటాయని అన్నారు. ఒకవేళ ప్రభుత్వం విధించిన ఆంక్షలు అహేతుకమైనవని, వాటి వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లిందని తర్వాత తేలితే, రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి కోర్టు నష్టపరిహారం ఇప్పించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే ఢిల్లీ హైకోర్టులో సంబంధిత పిటిషన్లు విచారణలో ఉన్నాయి. దసరా సెలవుల అనంతరం, అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ఈ పిటిషన్‌పై విచారణ జరిపే అవకాశం ఉంది.

## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర



కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నేహా బోరాను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ర్యాలీకి కొద్దిసేపటి ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో నిరసన చేపట్టాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అయితే, ఈ ర్యాలీకి మున్సిపల్ కౌన్సిల్ నుంచి అనుమతి లేదని, ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమల్లో ఉందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే ర్యాలీకి ముందు అభిజీత్ దీప్కేను, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు విదేశీ శక్తులతో కలిసి 'ప్రభుత్వాన్ని మార్చే కుట్ర' (రెజీమ్ ఛేంజ్) పన్నుతున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. 'రెజీమ్ ఛేంజ్' వంటి పదాల వాడకంతో ప్రతిపక్షాల అసలు ఎజెండా దేశం ముందు బయటపడిందని.. విదేశీ శక్తులతో కలిసి దేశాన్ని అస్థిరపరిచేందుకు అర్బన్ నక్సల్స్ పన్నిన పన్నాగం ఇది అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల తీర్పుతో వస్తుంది కానీ, అరాచకంతో కాదు అని ఆయన హితవు పలికారు. నేతల అరెస్టులు జరిగినప్పటికీ, సుమారు 200 నుంచి 300 మంది నిరసనకారులు కన్నాట్ ప్లేస్‌కు చేరుకుని తమ నిరసనను కొనసాగించారు.

## బంగ్లాదేశ్ తరహాలో
## పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర..



బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించకుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

**అధికారం కోసమే అరాచకమా?**

ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. 'పాలన మార్పు' వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

**ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ..**

కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు. "1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్.. ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

## అవును, ప్రభుత్వాన్ని మార్చడమే మా లక్ష్యం
## ప్రశాంత్ భూషణ్ సంచలన వ్యాఖ్యలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనల వెనుక అసలు ఉద్దేశం ప్రభుత్వాన్ని మార్చడమేనన్న బీజేపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, సీనియర్ న్యాయవాది, నిరసనకారుల బృంద సభ్యుడు ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, "అవును, మేము ప్రభుత్వాన్ని మార్చాలనే కోరుకుంటున్నాం" అని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలతో నిరసనకారుల అంతర్గత ఎజెండా స్పష్టమైందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో ఏఐఎస్ఏ నాయకురాలు నేహా బోరా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేలతో కలిసి ప్రశాంత్ భూషణ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. ఈ పోరాటం ఇప్పుడు నిజంగా ప్రభుత్వాన్ని మార్చడం కోసమే. ప్రభుత్వం ఇలాగే నిరంకుశంగా వ్యవహరిస్తే, కచ్చితంగా వ్యవస్థలో మార్పు వస్తుంది. గతంలో బీజేపీ కూడా అధికార మార్పిడి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టింది. ఇప్పుడు మేము చేస్తుంటే కుట్ర అని ఆరోపిస్తారా? ఈ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న సర్కారుపై మా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలపై రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శుక్రవారం లక్నోలో ఘాటుగా స్పందించారు. "అరాచక రాజకీయాల్లో యువతను పావులుగా మార్చాలని నిరసనకారులు కుట్ర పన్నుతున్నారు. బంగ్లాదేశ్ తరహాలో ఇక్కడ కూడా ప్రభుత్వాన్ని కూల్చడమే వారి లక్ష్యం. వారిలో ఒకరు ఈ విషయాన్ని బహిరంగంగానే వెల్లడించారు, దీన్నిబట్టి వారి అసలు ఎజెండా తేటతెల్లమవుతోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ, ఆయన అనుచరులు దేశంలో అశాంతిని రేకెత్తించడం, రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం మానుకోవాలని రాజ్ నాథ్ హితవు పలికారు. మరోవైపు, నిరసనకారుల బృందంలోని నేహా బోరా, బంగ్లాదేశ్‌లో జరిగిన యువజన ఉద్యమం తమకు స్ఫూర్తి అని పేర్కొన్న వీడియోను బీజేపీ ప్రధానాస్త్రంగా మలుచుకుంది.

# కృష్ణా జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్వర్యంలోపెదయాదర లో రుద్రార్చన -- సింధూరార్చన

**మోపిదేవి అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)**

మహిళల భాగస్వామ్యంతో ఆధ్యాత్మిక చైతన్యం -- దేవభక్తి, దేశభక్తికి పిలుపు



విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు కృష్ణా జిల్లా బందరు మండలం పెదయదరా గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి పందిరిలో రుద్రార్చన, సింధూరార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో 184 మంది మహిళలు పాల్గొని భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం గ్రామంలో ధార్మిక చైతన్యం, ఆధ్యాత్మిక ఆసక్తి, సామూహిక భాగస్వామ్యానికి నిదర్శనంగా నిలిచింది.
ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శ్రీ ఆడుసుమిల్లి శ్రీనివాసరావు, దేవస్థాన కమిటీ సభ్యులు, శ్రీ గల్లా త్రిమూర్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజల సహకారంతో కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో నిర్వహించబడింది.
విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్, జిల్లా ప్రభారి శ్రీ పీవీఎస్ నాయుడు తమ సందేశంలో మాట్లాడుతూ, ధార్మిక కార్యక్రమాలు కేవలం పూజలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడానికి, కుటుంబ వ్యవస్థలో సంస్కారాలను బలోపేతం చేయడానికి, ప్రజల మధ్య ఐక్యతను పెంచడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా భావితరాలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ధార్మిక విలువలను అందించగలరని తెలిపారు.హిందూ సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సామాజిక సమరసత మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. కుల, వర్గ భేదాలకు అతీతంగా ప్రజలందరూ పరస్పర గౌరవంతో, సోదరభావంతో ముందుకు సాగాలని, ధార్మిక కార్యక్రమాలు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలిపే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ధర్మంపై అవగాహనను పెంపొందించాలని పిలుపునిచ్చారు.వందేమాతరం మన మాతృభూమి పట్ల గౌరవం, కృతజ్ఞత, త్యాగం, జాతీయ ఐక్యతకు ప్రతీక. అది కేవలం ఒక నినాదం మాత్రమే కాకుండా, భారతదేశం పట్ల మనకున్న బాధ్యతను గుర్తుచేసే జాతీయ స్ఫూర్తి. దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల ఆదర్శాలను స్మరించుకుంటూ, దేశ సమగ్రత, సార్వభౌమత్వం, అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని వారు సూచించారు. దేశభక్తి అనేది మాటల్లోనే కాకుండా మన కర్తవ్య నిర్వహణలో, సమాజ సేవలో, జాతీయ సంపద పరిరక్షణలో, ఇతరుల పట్ల గౌరవభావంలో ప్రతిఫలించాలని పేర్కొన్నారు.దేవభక్తి మనిషిలో నైతిక విలువలను, క్రమశిక్షణను, సేవాభావాన్ని పెంపొందిస్తే, దేశభక్తి సమాజం పట్ల, మాతృభూమి పట్ల బాధ్యతను గుర్తుచేస్తుందని వారు తెలిపారు. దేవభక్తి -- దేశభక్తి పరస్పర విరుద్ధమైనవి కావని, దేశం పట్ల ప్రేమ, సమాజం పట్ల సేవాభావం, ధర్మం పట్ల నిబద్ధత సమన్వయంతో ఉన్నప్పుడే బలమైన, ఐక్యమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు.వందేమాతరం స్ఫూర్తిని ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ తీసుకెళ్లాలని, జాతీయ పండుగలు, ధార్మిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా యువతలోనూ, మహిళల్లోనూ దేశభక్తి భావనలను బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడటం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు.పెదయదరాలో 184 మంది మహిళల భాగస్వామ్యంతో నిర్వహించిన రుద్రార్చన, సింధూరార్చన కార్యక్రమం ధార్మిక చైతన్యం, మహిళల భాగస్వామ్యం, సామాజిక ఐక్యతకు ప్రేరణగా నిలిచింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన మహిళలకు, దేవస్థాన కమిటీ సభ్యులకు, నిర్వాహకులకు, గ్రామస్తులకు విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలియజేసింది.దేవభక్తి -- దేశభక్తివందేమాతరం -- జాతి ఐక్యతధర్మ పరిరక్షణ -- సమాజ సేవవిశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# గూడెంలో “”తెలుగు తమ్ముళ్ల” నిరసన

**శ్రీధర్ కు టికెట్ కేటాయించకపోవడం పట్ల ఉద్రిక్తత**

**గొర్రెలకు పోటీ చేసే అవకాశం ఇవ్వకపోతే మూకుమ్మడి రాజీనామా**

**ఆయన అభిమానులు పార్టీకి అల్టిమేటం.....**

**వేచి చూద్దామని కార్యకర్తలను సముదాయించిన” గొర్రెల’**




**తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీలో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడం; రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో జిల్లా వ్యాప్తంగా నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇదే కోణంలో తెలుగు తమ్ముళ్లు రోడ్డెక్కి తమ నేత గొర్రెల శ్రీధర్ కు చైర్మన్ పదవికి పోటీ చేసే అవకాశం కల్పించలేదంటూ పార్టీ అధిష్టానం పై ధ్వజం ఎత్తారు. విద్యార్థి దశ నుండి తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా పనిచేస్తూ అంచలించెలుగా పార్టీ పదవులను సమర్థవంతంగా నిర్వహిస్తూ తాడేపల్లిగూడెం కౌన్సిల్లో రెండు పర్యాయాలు కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. రెండవ పర్యాయం తనతో పాటు తన భార్యను వేరే డివిజన్ లో నిలబెట్టి గెలిపించుకున్నారు. పట్టణంలో వైస్ చైర్మన్ బాధ్యతలను నిర్వహిస్తూ సమర్థవంతమైన అనేక కార్యక్రమాలను చేపట్టారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేస్తూ కొవ్వూరు నియోజక వర్గానికి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు శ్రీధర్ పనితీరును ప్రశంసిస్తూ వచ్చారు. ఇప్పటికే వరుస క్రమంలో మూడు పర్యాయాలు జనరల్ కేటగిరీకి మున్సిపల్ చైర్మన్ పదవి రిజర్వ్ కావడంతో ఈసారి బీసీలకు కేటాయిస్తారని అందరు ఆశించారు. ఆ దిశగా గొర్రెల శ్రీధర్ ర్ కోట్లాది రూపాయలు హెచ్చించి నియోజకవర్గంలో, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మనలను పొందారు”
ఆంధ్ర సింహ... తాడేపల్లిగూడెం డామిట్ కథ అడ్డం తిరిగింది. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ జనరల్ కు కేటాయించారని తెలియగానే అక్కడ తెలుగుదేశం శ్రేణులలో ఆగ్రా వేషాలు కట్టలు తెంచుకున్నాయి. ఇక్కడ మున్సిపాలిటీ బీసీ కేటగిరికి రిజర్వేషన్ అవుతుందని ఎప్పటినుండో అంచనాలు వేస్తున్న వారి ఆశలు తలకిందులు అయ్యాయి. తమ నాయకుడు మున్సిపల్ చైర్మన్ అవుతాడని తమకు ఎంతో ఉపయోగపడతారని ఆశించిన వారి ఆశలు అడియాసలుగా మారాయి. ఏంటి? ఎలా జరిగిందంటూ? ఒక్కక్కరిగా శ్రీధర్ ఇంటి బాట పట్టారు. ఆయన వారిని సమదాయించే సమయంలోనే చిలికి చిలికి గాలి వానలా కార్యకర్తలు పోటెత్తారు. ఎవరికి వారు అధినేత తీరుపై మండిపడ్డారు. ఇది ఎన్నికల కమిషన్ నిర్ణయమ? లేక రాజకీయ ప్రలోభాలకు రిజర్వేషన్లు మారాయా అంటూ? ప్రశ్నల వర్షం కురిపించారు. ఒక మాటకు సమాధానం చెప్తుండగానే మరొకరు ప్రశ్న చేయడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రాష్ట్ర పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయానికి మనం కట్టుబడి ఉండాలని కార్యకర్తలకు చెబుతూ వచ్చారు. మేము లేకుండా మీరు ఎక్కడ ఉంటారు అని మేము ఓట్లు వేస్తేనే మీరు నాయకుడిగా ఉండేదని శ్రీధర్ పై కార్యకర్తలు మాటల దాడికి దిగారు. మేము చెప్పినట్లుగానే మీరు నడవాలని! తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని శ్రీధర్ చెప్పారు. దానికి వారు నిరాకరించడంతో రెండు రోజులు పాటు వేచి చూద్దామని అధినాయకత్వం నుండి వచ్చే సమాధానం పై మీ నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటారని శ్రీధర్ కార్యకర్తలకు చెప్పారు. దీంతో శాంతించిన కార్యకర్తలు నినాదాలు చేస్తూ చైర్మన్ పదవికి పోటీ చేసే అవకాశం కల్పించాలంటూ గర్జించారు. శ్రీధర్ ఇంటివద్దె కార్యకర్తలు బయట వేయించారు. సాయంకాల సమయం ఆరు అయినా కార్యకర్తలు కదలకపోవడం విశేషం.

# ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి హేయమైన చర్య:

**ప్రజాస్వామ్యంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ**

**ముమ్మిడివరం, అక్టోబర్ 16 (తెలుగు రాష్ట్రం విలేఖరి)** పుంగనూరులో రాజంపేట పార్లమెంట్ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై జరిగిన దాడిని అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు, బెదిరింపులు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన విమర్శించారు. తాజాగా తిరుపతి జిల్లా పుంగనూరులో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై జరిగిన దాడి అత్యంత గర్హనీయమని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసి ప్రజల తీర్పును కోరాల్సిన అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష నాయకులపై భౌతిక దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని కాశి రామకృష్ణ ప్రశ్నించారు. ఎంపీ మిథున్ రెడ్డి వాహనాలపై రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ ఘటనలో భద్రతా సిబ్బందిపై కూడా దాడి జరిగినట్లు వచ్చిన వివరాలను పోలీసులు సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు.
ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పోలీసుల సమక్షంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన యంత్రాంగం ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన విధులను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు, దౌర్జన్యానికి తావు లేదని, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాశి రామకృష్ణ స్పష్టం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి, ఆధారాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తో పాటు ప్రతిపక్ష



ప్రజాప్రతినిధులకు తగిన భద్రత కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.
ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే రాజకీయ హింసను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని, దాడులు, బెదిరింపులతో రాజకీయంగా పైచేయి సాధించాలనుకోవడం భ్రమేనని కాశి రామకృష్ణ పేర్కొన్నారు.

## ఉప్పరగూడెంలో ఘనంగా గుంతలమ్మ పండగ



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెంలో కులదేవతగా కొలుచుకునే గొంతాలమ్మ తల్లి ఉత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. జనతా గ్యారేజ్ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ పందిరి ఏర్పాటు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు శనివారం నిర్వహించేం దుకే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను నిర్వాహకులు రాపక వెంకన్న, పోలిమాటి సుబ్బరాజు, మరపట్ల దానయ్య, రాపక చింటూ దండే అమర్బాబు, దేశాబత్తుల వెంకట్రావు, ఏలూరి విజయ్ (భద్రి) సన్ని ఇంద్రా, సుభాష్, ఏలూరు వెంకటేష్ (పుష్ప) ఏలూరు బన్ని మ లపర్తి కిరణ్, నేటి అనిల్ పర్యవేక్షిస్తున్నారు.

## స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి సమన్వయంతో పనిచేయాలి -- గొల్లపల్లి అమూల్య



**రాజోలు అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)** శివకోటి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొని, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాను.ప్రతి కార్యకర్త కృషికి తగిన గుర్తింపు, ప్రతి గ్రామంలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరం ఐక్యంగా పనిచేయాలి. ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ స్థానిక సంస్థల్లో 100 శాతం స్థానాలను కైవసం చేసుకునే దిశగా ముందుకు సాగుదాం అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## శ్రీ మహాలక్ష్మీ అలంకారంలో శ్రీ వాసవి అమ్మవారు రూ.4.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ

**అమలాపురం,మీ వార్త ప్రతినిధి,**అక్టోబర్ 16



దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమలాపురం మెయిన్ రోడ్డులో కొలువై ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శుక్రవారం శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుమారు రూ.4.50 కోట్ల విలువైన కొత్త కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. ఆలయ ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను రూ.10, రూ.50, రూ.100, రూ.500 నోట్లతో అందంగా అలంకరించారు. కరెన్సీ నోట్లతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సంఘం కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కో-చైర్మన్లు పచ్చిగోళ్ల సోమరాజు, నూలు శ్రీనివాసు తదితరులు పాల్గొని తమ సేవలను అందించారు.

## రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు..

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గాల్లో వైసీపీ విధ్వంసం సృష్టించిందంటూ వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా దాడులకు పాల్పడ్డారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ కార్యకర్తలు, ప్రజలపైకి కాన్వాయ్‌తో దూసుకెళ్లి భయానక వాతావరణం సృష్టించారని వర్ల రామయ్య ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో దృశ్యాలను వారు ఎన్నికల సంఘానికి ఆధారాలుగా సమర్పించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తోందని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ ఫిర్యాదుతో రాయలసీమలో స్థానిక ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

**మిథున్‌రెడ్డిపై టీడీపీ గూండాల దాడి.. వైఎస్సార్‌సీపీ సీరియస్**

ఎంపీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండించింది. టీడీపీ నేతలు.. దాడులు చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవలేక అక్రమమార్గంలో వెళు న్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారు. ఏపీలో శాంతి భద్రతలు విఫలమైందని ఆయన మండిపడ్డారు. “బందీపోటు దొంగల్లా టీడీపీ గూండాలు దాడులు చేస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై కర్రలు, రాళ్లతో దాడులు చేశారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైన మొదటిరోజే దాడులు చేస్తున్నారు” అని లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు.

**ఓటమి భయంతోనే దాడులు..**

విజయనగరం: ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్యులకే రక్షణ లేదని.. ఓటర్లను, అభ్యర్థులను భయపెట్టాలని చంద్రబాబు కుట్ర పన్నుతున్నారంటూ మండిపడ్డారు. చిత్తూరు జిల్లాలో ఎంపీ మిధున రెడ్డి పై దాడిని ఖండిస్తున్నాం. చంద్రబాబు దుష్ట పరిపాలనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఓటమి భయంతో వైఎస్సార్సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారు” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్యంలో నేడు చీకటి దినం**

చిత్తూరు: ప్రజాస్వామ్యంలో నేడు చీకటి దినం అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకు పోరాటం ఆగదు

**ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు**

**మెడికల్ సెక్యూరిటీ కార్మికులకు 18,600 లు ఇవ్వాలి**

**కనీస వేతనం రూ.34 వేలు ఇవ్వాలి**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్**

**కాకినాడలో ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా**







**కాకినాడ, అక్టోబర్ 16 న్యూస్ (తెలుగు రాష్ట్రం విలేఖరి)** కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి జి ఓ 138 ప్రకారం 18, 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లీయీస్ ఉ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏఐటీయూసీ కాకినాడ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ ధర్నాను ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత లేకుండా, తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమను ప్రభుత్వం వినియోగించుకుంటూ వారి భవిష్యత్తుకు మాత్రం భద్రత కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఒకే పని చేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనాన్ని వెంటనే రూ.34,000లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించకుండా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పేరుతో కొనసాగించడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకు, కనీస వేతనం రూ.34,000లు అమలు చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు జీ.వో. 138 ప్రకారం నెలకు రూ. 18,600/- వేతనంతో పాటు గ్రాఖీ, జూ× అమలు చేయకుండా మోసం చేస్తున్న ఏజెన్సీలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని కోరారు 50 ఏళ్ల వయోపరిమితి రద్దు: శానిటేషన్ కార్మికులకు విధించిన 50 సంవత్సరాల వయోపరిమితి నిబంధనను వెంటనే రద్దు చేసి, తొలగించిన పాత కార్మికులందరినీ బేషరతుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు సెలవులు ఉ ప్రసూతి హక్కులు: జాతీయ పండుగలు, వారాంతపు సెలవులు కల్పించాలి. మహిళా కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి. అనివార్య కారణాలతో విధులకు గైర్హాజరైతే వాటిని అర్జిత సెలవులు ఈ ఎల్ ఎస్ గా పరిగణించాలి.

పే స్లిప్పులు ఇవ్వని ఏజెన్సీలపై చర్యలు: నిబంధనల ప్రకారం ప్రతి నెలా కార్మికులకు వేతన రశీదులు (పే స్లిప్పులు) ఇవ్వని కాంట్రాక్ట్ ఏజెన్సీలను వెంటనే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని అన్నారు ప్రకారం సిబ్బంది భర్తీ: ఒప్పందం ఎం ఓ యు ప్రకారం ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలు, డి హెచ్ ఎస్. విభాగాలలో పూర్తిస్థాయి అదనపు సిబ్బందిని నియమించి, అందరికీ వేతన రశీదులు అందజేయాలి.

కావున, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి తగిన న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నాముని ప్రసాద్ కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కిషోర్, జీజీ హ్ చ్ అధ్యక్షులు రామయ్య, ప్రధాన కార్యదర్శి అనిల్, మధు. అనురాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా వారి చే

**పెడసనగల్లు, భట్లపెనుమర్రులో రుద్రార్చన -- సింధూరార్చన**



**మొవ్వ, అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** ధర్మచైతన్యం -- మహిళా భాగస్వామ్యం -- సామాజిక సమరసతకు ప్రాధాన్యం మొవ్వ మండలంలోని పెదశనగల్లు, భట్లపెనుమర్రు రహదారిలోని రామాలయాల్లో శుక్రవారం రుద్రార్చన, సింధూరార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. సంబంధిత ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ రెండు కార్యక్రమాల్లో మొత్తం సుమారు 80 మంది మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పెదశనగల్లులోని హైస్కూల్ సమీపంలో ఉన్న కోదండ రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 30 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు భట్లపెనుమర్రు రహదారిలోని రామాలయంలో జరిగిన రుద్రార్చన, సింధూరార్చన కార్యక్రమంలో మరో 50 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో సంస్థ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన గ్రామస్థాయిలో జరిగే ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా స్థానిక ఆలయ కమిటీలు, భక్తులతో సంస్థాగత సమన్వయానికి ప్రాధాన్యతనిచ్చారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు ధార్మిక సంప్రదాయాల పరిరక్షణతో పాటు గ్రామీణ సమాజంలో భక్తిభావం, పరస్పర సహకారం, సామాజిక ఐక్యతను పెంపొందించడానికి దోహదపడతాయి. శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం పాల్గొనడం ద్వారా విశ్వ హిందూ పరిషత్‌కు, స్థానిక ఆలయ కమిటీలకు మధ్య సమన్వయం, గ్రామస్థాయిలో ధార్మిక కార్యక్రమాల ప్రోత్సాహం ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో వారి క్రియాశీల పాత్రను ప్రతిబింబించింది.డా. బూరగడ్డ శ్రీనాథ్ సందేశంఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూ, దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి మాత్రమే కాకుండా సామాజిక సమరసత, సేవాభావం, సాంస్కృతిక విలువల పరిరక్షణకు కూడా కేంద్రాలుగా నిలవాలని అన్నారు. గ్రామాల్లో ఆలయ కమిటీలు, మహిళలు, యువత సమన్వయంతో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం మరింత బలపడతాయని పేర్కొన్నారు. "దేవభక్తి -- దేశభక్తి పరస్పర పూరకాలు. ధర్మాన్ని గౌరవించడం, భారతీయ సంస్కృతిని పరిరక్షించడం, సమాజంలోని అన్ని వర్గాల మధ్య సోదరభావాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. 'వందేమాతరం' స్ఫూర్తితో మాతృభూమిని గౌరవిస్తూ, దేశ ఐక్యత, సమగ్రత, ప్రజల శ్రేయస్సు కోసం కృషి చేయాలి" అని డా. శ్రీనాథ్ పిలుపునిచ్చారు.భారతీయ సంస్కృతిలోని "సర్వేజనా సుఖినోభవంతు" అనే ఆదర్శాన్ని ఆచరణలో పెట్టి, సమస్త ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, సామాజిక సమరసత, లోకకల్యాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన ఆకాంక్షించారు. ధార్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో సేవాస్ఫూర్తిని, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయాలని సూచించారు.దేవభక్తి -- దేశభక్తి -- ధర్మ పరిరక్షణ -- సామాజిక సమరసత -- లోకకల్యాణం

వందేమాతరం!

భారత్ మాతాకీ జై!విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా

# పెద్దకళ్లేపల్లి ఎన్టీఆర్ కాలనీలో సామూహిక రుద్రార్చన, సింధూరార్చన,

**విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా అధ్వర్యంలో**



**మోపిదేవి అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)** ధర్మచైతన్యం -- మహిళా భాగస్వామ్యం -- సామాజిక సమరసత,మోపిదేవి మండలం, పెద్దకళ్లేపల్లి గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి పందిరి వద్ద సామూహిక రుద్రార్చన, సింధూరార్చన, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని విశ్వ హిందూ పరిషత్ మోపిదేవి ఖండ ప్రముఖ్ అర్జా ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక భక్తులు, మహిళలు సామూహిక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం ఆలయ కమిటీ సభ్యులకు, కార్యక్రమ నిర్వాహకులకు, పాల్గొన్న భక్తులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, పరస్పర సోదరభావం మరియు సామాజిక సమరసత సాధనకు దోహదపడే మరిన్ని ధార్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ సందేశమిస్తూ, సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో దైవభక్తిని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, సామాజిక సమరసతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కులమత భేదాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ధార్మిక, సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, మహిళల భాగస్వామ్యంతో సనాతన ధర్మ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. దేవభక్తితో పాటు దేశభక్తి, సామాజిక సమరసత, సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందినప్పుడే బలమైన, ఐక్యమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఓం శ్రీ మాత్రే నమః! సర్వేజనాః సుఖినో భవంతు!

పత్రికా ప్రకటన విడుదల చేసినవారు:జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

కార్యాలయ ప్రముఖ్

విశ్వ హిందూ పరిషత్ -- కృష్ణా జిల్లా,అమ్మవారి ఉత్సవ కమిటీ

ఎన్టీఆర్ కాలనీ, పెద్దకళ్లేపల్లి

మోపిదేవి మండలం, కృష్ణా జిల్లా

## కానూరు సత్య నగర్ కాలనీలో దుర్గమ్మ అమ్మవారి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ**



**మచిలీపట్నం అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)** మచిలీపట్నం మండలం కానూరు పంచాయతీ సత్యానగర్ కాలనీ ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారి మండపంలో ఏర్పాటు చేసిన సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొని తర్వాత అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీ గోపు సత్యనారాయణ, కానూరు మాజీ సర్పంచ్ శ్రీమతి గోపు వెంకటేశ్వరమ్మ దంపతులు...ఈ సందర్భంగా అమ్మవారి దయతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో అమ్మవారి ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో గోపు ప్రతాప్ నరేష్ కుమార్, గోపు నాగ మహేష్ బాబు,దివి మహేష్,బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, చిటికినేటి అయ్యప్ప, ఇవన వెంకన్న, ఇవన చిన్న తదితరులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం





**ఏలూరు, అక్టోబర్ 16( మీ వార్త ప్రతినిధి ):** ఎన్నికల నామినేషన్ల పర్వం నేపథ్యంలో ఏలూరు నగరంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ వారు ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ యొక్క ఆదేశాలపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిన ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు మరియు సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె రామకృష్ణ ఎస్సైలు సుధాకర్ రామ కృష్ణ మరియు పోలీస్ సిబ్బంది స్వయంగా రంగంలోకి దిగి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ట్రాఫిక్ మళ్లింపు మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న ముందస్తు చర్యలు సజావుగా సాగేలా చూడటంతో పాటు, కార్పొరేషన్ కార్యాలయ పరిసరాల్లో పూర్తి నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని వన్ టౌన్ పోలీసులు స్పష్టం చేశారు.

## రౌడీయిజం తో ప్రతిపక్షల గొంతు నొక్కలేరు

**వైసీపీ నేత రమణారావు**

**ఎంపీ మిథున్ రెడ్డి పై జరిగిన దాడిని ఖండించిన వైసిపి సీనియర్ నేత కుంచే రమణారావు. అమలాపురం,**



**అక్టోబర్ 16 ( మీ వార్త ప్రతినిధి ):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై కత్తులు, రాళ్లు, కర్రలతో టీడీపీ నాయకులు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రమణారావు పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమానికి వెళుతున్న సమయంలో జరిగిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రౌడీయిజంతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరు!" ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలకు హింస పరిష్కారం కాదని, ప్రతిపక్ష నాయకులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని రమణారావు అన్నారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించే వారిని ప్రజలు ప్రశ్నిస్తారని పేర్కొంటూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రమణారావు డిమాండ్ చేశారు.

## మున్సిపల్ ఎన్నికలపై టీడీపీ కసరత్తు - కూటమి నేతలతో ఎమ్మెల్యే కీలక సమావేశం



**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 16 ( మీ వార్త ప్రతినిధి ):**మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పట్టణ టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులతో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను 32 వార్డుల్లో కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే, కూటమి పార్టీల తరఫున ప్రభుత్వం, అధిష్టానం టిడిపి అభ్యర్థిని ఎవరిని అభ్యర్థులుగా ప్రకటించినా అందరూ కలిసికట్టుగా పనిచేసి 32 వార్డుల్లో కూటమి జెండాలు ఎగరవేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రవి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి, పట్టణ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచెయ్యాలి





## టీడీపీ ఇంచార్జి --గొల్లపల్లి అమూల్య

**రాజోలు, అక్టోబర్ 16 ( మీ వార్త ప్రతినిధి ):** నియోజకవర్గ పరిధిలోని శివకోటి గ్రామంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజోలు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య ఆదేశాల మేరకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీమతి అనుచూరి సునీత పురుషోత్తం అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పెచ్చెట్టి నరసింహారావు'బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు, రిజర్వేషన్లు విడుదలైన నేపథ్యంలో టిడిపి జనసేన బిజెపి సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, కూటమి పార్టీలతో కమిటీలు ఏర్పాటు చేస్తారని ఆశావహులు అందరూ తమ తమ అభ్యర్థనలను ఆ కమిటీకి తెలియపరచవచ్చని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా మన ఓటమి ప్రభుత్వం అమలు చేస్తుందని డీఎస్సీ, పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం ఇలా అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలకు మన కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఇదే క్రమంలో పోలవరం అమరావతి రాష్ట్రంలోని రోడ్లు అనేక ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తూ సంక్షేమం అభివృద్ధి జోడెద్దుల బండిల నడిపిస్తున్న మన కూటమి ప్రభుత్వం. ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటిని పలకరిస్తూ స్థానిక సంస్థల అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్థానిక సంస్థలను నూటికి నూరు శాతం మనమే కైవయసం చేసుకోవాలని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, మండలం పార్టీ అధ్యక్షులు అనుచూరి సునీత రామ పురుషోత్తం, అడబాల సాయిబాబా, తాడి సత్యనారాయణ, గెడ్డం సింహ, శ్రీమతి కాకి లక్ష్మీదేవి, కాకి లక్ష్మణరావు, పొలమూరి శ్యాంబాబు, కసుకుర్తి త్రినాధ స్వామి, ఆరుమిల్లి భాను, గోనిపాటి రాజు, పప్పుల రమేష్, స్థానిక గ్రామశాఖ అధ్యక్షులు కడలి ఏడుకొండలు, మెరుగుమువ్వల సత్య వరప్రసాద్, కడలి నాగేశ్వరరావు, జంపన వెంకట సత్యనారాయణ రాజు, గుత్తులు ఉమా, కొల్లాటి సత్యనారాయణ, పొన్నాల విజయ్, ఉంద్రాజవరపు బాబురావు, శ్రీమతి చింతపల్లి నాగలక్ష్మి, శ్రీమతి కొత్తపల్లి విజయలక్ష్మి, కడలి దుర్గా పద్మావతి కొల్లాబత్తుల గోపాలకృష్ణ, మెండా వెంకటేశ్వరరావు, యువనాయకులు జిల్లెళ్ళ పావెల్ రెడ్డి, కోడెళ్ళఅజయ్ బాబు, కడలి రమేష్, చిట్టూరి సంతోష్, డబ్బాల విక్రమ్, ముత్యపల్లి సురేష్, పట్నాల శ్రీను, భద్ర, గొల్ల జస్పాల్, చిగురుపాటి ఆనంద్, నేదూరి బాబు, మటపర్తి నాగేంద్ర, మరియు వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు వివిధ పార్టీ పదవులలో ఉన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీకి మరో షాక్-గుడ్‌బై చెప్పిన సన్నపురెడ్డి బ్రదర్స్

**నెల్లూరు జిల్లా అక్టోబర్ 16 (మీ వార్తా ప్రతినిధి )** వైఎస్ఆర్సీపీకి ఆ పార్టీ నేతలు షాక్ ల మీద షాకులిస్తున్నారు. అభివృద్ధి కే మా మద్దతు అంటూ అధికార టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారు. రోజుకో డివిజన్ లో కండువాలు మారుస్తూ వలస బాట పడుతున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సన్నపురెడ్డి సోదరులు వైఎస్ఆర్సీపీ అగ్రనేతల ఒంటెద్దు పోకడలు నచ్చక ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. సన్నపురెడ్డి ఆఫీస్ కి వెళ్లి మంత్రి నారాయణ,ఎంఎల్ఏ శ్రీధర్ రెడ్డిలు ఆహ్వానించటంతో సోదరులు,వారి సహచరులు రేపు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పెంచలరెడ్డి , సుబ్బారెడ్డి ,శ్రీనివాస్ ముగ్గురూ వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరడానికి నిర్ణయించుకోవటం శుభ పరిణామమన్నారు. రూరల్ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సన్నపురెడ్డి పెంచలరెడ్డి , వారి సోదరుడు సుబ్బారెడ్డి నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో మంచి పలుకుబడి ఉన్న నేతలని. వీరితో పాటు మంచికంటి శ్రీనివాసులు కూడా వైసీపీకి రాజీనామా చేసి, మంత్రి నారాయణ గారి ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతుండటం సంతోషకరం అన్నారు. సన్నపురెడ్డి సోదరులు ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో, అంకితభావంతో కష్టపడి పనిచేస్తారన్నారు. రేపు వారు అధికారికంగా పార్టీలో చేరుతారన్నారు. సన్నపు రెడ్డి పెంచలరెడ్డి



మాట్లాడుతూ. అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో మమేకమైన తమను విస్మరించడం వల్లనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామన్నారు. వైసీపీకి చెందిన ప్రముఖ నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, మంచికంటి శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకుకోవడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న వైసికి తీవ్ర నష్టం చేకూరుస్తుందంటున్నారు. మంత్రి,ఎంఎల్ఏ లతో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయ్ భాస్కర్ రెడ్డి, స్వయంగా సన్నపురెడ్డి సోదరుల ఆఫీస్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు..

# పట్టణ మున్సిపాలిటీ 21 వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ అభ్యర్థిగా పిప్పళ్ళ సుప్రజ

**నర్సాపురం అక్టోబర్ 16 మీ వార్త జిల్లా ప్రతినిధి. సాల్మన్ రాజు**

జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ 2014 స్థాపించిన జనసేన పార్టీ నాటునుండి నేటి వరకు జనసేన పార్టీలో కొనసాగుతూ ఎంతో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు ప్రజలకు అర్హులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకునేవారు.

సంఘ సేవ విద్యార్థిని విద్యార్థుల కు సంతకచ్చు అయితే వ్యాక్సిన్ టీకాలు వేయించడం

నరసాపురం నియోజకవర్గం లో ఉన్న స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ఆమె సొంత ఖర్చులతో వ్యాక్సిన్ టీకాలు, డయాబెటిక్ టెస్టులు, నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ ప్రతి విద్యార్థి విద్యార్థిను పరిశుభ్రంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు

**ఆకలితో ఉన్న వారిని ఆదుకునే మనస్తత్వం సుప్రజ**

పట్టణంలో అనాధలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు, వారంలో ఒక రోజున అన్నదానం, టిఫిన్స్, వాటర్ బాటిల్ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు అనారోగ్యంతో గురైన వారికి తన వంతు సహాయం చేసే వ్యక్తి సుప్రజనరసాపురం నియోజకవర్గం లో అనారోగ్యంతో గురైన వారికి తన వంతు సహాయం చేస్తూ వారికి వైద్య ఖర్చుల నిమిత్తం నగదు మరియు నిత్యవసర సరుకులు అందజేసి వారికి మెరుగైన ఆరోగ్యం కొరకు ప్రముఖ డాక్టర్లను సలహాలు తీసుకుని వారికి రెఫర్ చేసేవారు అనారోగ్యంతో గురైన వారిని ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని




మానవత్వాన్ని చాటుకున్నారు ప్రముఖ న్యాయవాది న్యాయవాది వృత్తిలో ఉండి పేద ప్రజలకు న్యాయ సేవ అందిస్తూ ప్రజలకు ఉచిత సలహా ఇస్తూ పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవ అందిస్తు మానవత్వాన్ని చాటుకున్నారు జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు జనసేన పార్టీలోనే కొనసాగుతున్నారు నరసాపురం నియోజకవర్గం లో జనసేన పార్టీకి ఎంతో కష్టపడ్డానని ఎంత కష్టపడినా ఇక్కడ నాయకులు గుర్తించలేదని ఆమె శుక్రవారం మీడియా సమావేశంలో ఆవేదన చెందారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపురం నియోజకవర్గంలో నాయకులు గుర్తించకపోయినా జనసేన పార్టీ అధినేత గుర్తించారని అన్నారు ప్రజలు అండదండలు ఉండటంతో వార్డు ప్రజలు సహాయ సహకారాలు,మద్దతుతో నరసాపురం పట్టణ మున్సిపల్ 21వార్డు కౌన్సిలర్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేయాలని నిర్ణయించుకున్నాను అన్నారు ఈ వార్డులో ప్రజలు నాకు పూర్తిగా మద్దతు తెలిపారని అత్యధిక మెజార్టీతో గెలుపొంది ప్రజలకు మరింత సేవ చేసుకునే భాగ్యం కల్పిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టి నిర్ణయాలతో టికెట్ల పంపకం జరగాలి...పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు





**పోలవరం మీ వార్త అక్టోబర్ 16** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొయ్యలగూడెంలో పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బోరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోలవరం నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏపి క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ... మండల నాయకులందరూ సమష్టిగా చర్చించి, ఏకాభిప్రాయంతో టికెట్ల పంపకం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పార్టీ ఐక్యతను కాపాడుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్, పోలవరం నియోజకవర్గ టీడీపీ నాయకురాలు కొవ్వాసు జగదీశ్వరి పాల్గొనగా, కొయ్యలగూడెం మండల అధ్యక్షులు పారేపల్లి రామారావు సీనియర్ నాయకులు జ్యేష్ట రామకృష్ణ, నాయకులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

## కూటమి లో కుంపటి.. తెగని పంచాయతీ.



**నెల్లూరు జిల్లా అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి )** రూప్ కుమార్ నా వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి నా ఎన్నికల్లో విజయం అటుంచి అభ్యర్థి ఎంపికలో కూటమి లో విజయం ఎవరిదో. అభ్యర్థి విషయం లో వీడని ఉత్కంఠ.. కంటిన్యూ అవుతున్న క్యూరియాసిటీ. మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నువ్వా నేనా.

ముగ్గురూ బలవంతులే.. మరి ఎవరిమాట నెగ్గుతుంది?

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి..మంత్రి నారాయణ..మీజ టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర..ముగ్గురు మధ్య మూడుముక్కలాట రూప్ కుమార్ యాదవ్ ను మేయర్ అభ్యర్థిగా మొదటినుండి బలపరుస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,మంత్రి నారాయణ వైసీపీ విజయ్ కుమార్ రెడ్డిని మేయర్ అభ్యర్థి గా నిలబెట్టడం రిజర్వేషన్ లో జనరల్ కావడం తో రెడ్డి సామాజిక వర్గం కాకుండా రూప్ ను నిలబెట్టడం పై మంత్రి నారాయణ విముఖత. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అభ్యర్థి ఎంపిక విషయం లో ప్రేక్షక పాత్ర. నోటిఫికేషన్ వచ్చి 24 గంటలు గడుస్తున్నా నామినేషన్ల పర్వం మొదలైపోయినా అభ్యర్థి ఎంపిక విషయంలో నత్తనడకన కొనసాగుతున్న కూటమి నేతల నిర్ణయాలు. చివరగా రూప్ కుమార్ యాదవ్ నా వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి నాలి. తమకు నగర కార్పొరేషన్ లో 21 సీట్లు కావాలంటూ జనసేన పట్టు..బీజేపీ 8 సీట్లకు డిమాండ్. బీజేపీ,జనసేన పార్టీ అభ్యర్థులు నిలబడే స్థానాల్లో విజయం తమదే అని సంబర పడుతున్న వైసీపీ పార్టీ అభ్యర్థులు

## గూడూరు ఎం పి పి స్తానం జనరల్ మహిళ కు కేటాయింపు హర్షణీయం!

జనసేన పార్టీ నుంచి చింతల చంద్రకళ




**గూడూరు అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)** గుడూరు మండల ఎం పి పి పదవి జనరల్ మహిళ కు కేటాయింపు జనరల్ వర్గాలకు శుభపరిణామం. ఈ సందర్భంగా మన గూడూరు మండలం పోసినవారి పాలెం గ్రామానికి చెందిన చింతల చంద్రకళ ఎంతో సౌమ్యురాలు,.జనరల్ లేడీ అయినందున పేరు వెలుగులోకి వస్తుంది. చింతల చంద్రకళ: విద్యావంతురాలు, విద్యా అభ్యసించిన నాన్న ,భర్త నుంచి నేర్చుకున్న రాజకీయ అవగాహన చింతల చంద్రకళ ని ఎం పి పి మహిళగా ఎన్నుకుంటే పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ గారు పరిశీలిస్తే మంచి అభ్యర్థి అవుతారని ప్రజానీకం అనుకుంటున్నారు.

## చిక్కాలను ఘనంగా సత్కరించిన కాకాడ కృష్ణ



**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,అక్టోబరు 16 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మండలంలోని గజపతినగరం గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ దళిత నాయకులు కాకాడ కృష్ణను పార్టీ అధిష్టానం నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కాకాడ కృష్ణ శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావును పెంటకోటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు యజ్జల సత్యనారాయణ (అన్నవరం), శ్రీరామపురం గ్రామ శాఖ అధ్యక్షులు తిరుమలరాజు నరసింహరాజు, పార్టీ మండల కార్మిక విభాగం అధ్యక్షులు బగ్గు విసన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోడపాటి గోవిందు, బొడ్డపాటి గోవిందు, యజ్జల శివ కుమార్, వంకా శ్రీను, రాయి తాతారావు, ఏడిద కృష్ణ, రాయి చిన్న, చేవ్వేటి అప్పారావు, కాకాడ గంగరాజు, మిరియాల ప్రభాకర్, ఏడిద కన్నారావు, చీలి నానీ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సీఎంవోపై పర్సంటేజీ ఆరోపణలు

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులపై అవకతవకలు, అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామా రమేశ్.. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకత్వానికి లేఖ రాసి దాన్ని మీడియాకు లీక్ చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పరిధిలోని రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు మూడు ప్యాకేజీల టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆయన లేఖలో వివరించారు. సాధారణంగా 10 నుంచి 12 పెద్ద కంపెనీలు పాల్గొనే ఇలాంటి ప్రతిష్టాత్మక టెండర్లలో.. కేవలం నాలుగు సంస్థలు మాత్రమే పాల్గొనేలా సీఎం కార్యాలయం నుంచి ఇతర కాంట్రాక్టర్లకు బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగానే నిర్ణయించిన సంస్థలకే పనులు కట్టబెట్టేలా ముందస్తు ఒప్పందాలు కుదిరాయని అందులో పేర్కొన్నారు. ఈ టెండర్ల ప్రక్రియలో సుశీ ఇన్‌ఫ్రా సంస్థను ఉద్దేశపూర్వకంగానే డిస్క్వాలిఫై చేశారని నామా రమేశ్ లేఖలో ప్రముఖంగా లేవనెత్తారు. ఇండో-చైనా సరిహద్దు వంటి

# అధిష్టానం ఆదేశిస్తే జడ్పీటీసీగా పోటీకి సిద్ధం -- చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులు

**నర్సాపురం : అక్టోబర్ 16 మీ వార్త జిల్లా ప్రతినిధి.** నరసాపురం మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని నరసాపురం మండల ఎంపీటీసీ చంద్రశేఖర్, వారి ధర్మపత్ని శ్రీదేవి స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఆదేశిస్తే నరసాపురం జడ్పీటీసీ (జడ్పీటీసీ ) స్థానం నుండి పోటీ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు ఈ రోజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జనసేన పార్టీ అధ్యక్షుడు, గౌరవనీయ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు, ఆదర్శాలకు ఆకర్షితులమై తాము పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నాయకర్ అడుగుజాడలలో నడుస్తున్నామని ఆయన చెప్పారు. నరసాపురం మండలంలో ఇప్పటికే ఎంపీటీసీగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎంపీటీసీ ఆకన చంద్రశేఖర్ పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకత్వం మరియు పార్టీ అధిష్టానం తమపై నమ్మకంతో శ్రీదేవి కి నరసాపురం జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే, మండల పరిధిలోని అన్ని గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆకన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కేడర్‌ను,



ప్రజలను సమన్వయం చేసుకుంటూ జనసేన జెండాను నరసాపురంలో ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు వివరించారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా క్రమశిక్షణ గల సైనికుల్లా పనిచేస్తూ, అధినేత పవన్ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆయన ఆధ్వర్యంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఆకన చంద్రశేఖర్ శ్రీదేవి మీడియా కు స్పష్టం చేశారు.

# పట్టణమంతా అమ్మవారి సంబరాలతో భక్తి భావం ఉట్టిపడుతోంది

## శ్రీవాసవి మాత కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం అక్టోబర్ 16 మీ వార్త జిల్లా ప్రతినిధి.** భీమవరం,ఊరు వాడలంతా అమ్మవారి సంబరాలతో భక్తి భావం ఉట్టిపడుతోందని, భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ శరన్నవరాత్రులను ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక వేడుకగా చెప్పుకోవచ్చునని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా భీమవరం త్యాగరాజ భవనంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వర్తక సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీవాసవి మాత కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి 59వ దసరా మహోత్సవంలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి దసరా మహోత్సవాలను గత 58 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# తల్లాడ మండల అధికారులకు వాలీబాల్ క్రీడాకారులు వినతి

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.17.10.2026**
తల్లాడ తహసీల్దార్ కార్యాలయం ప్రక్కన ఉన్న స్థలంలో గత 40 సంవత్సరాలుగా మేము క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకుని వాలీబాల్ ఆడుతున్నాము. ఈ మైదానం ద్వారా ఎంతో మంది క్రీడాకారులు నైపుణ్యం సంపాదించి ఉద్యోగాలు సాధించారు. ఈరోజుకీ ఎంతో మంది యువత శారీరక దృఢత్వం, ఆరోగ్యం, ఆనందం కోసం ఈ మైదానాన్ని నమ్ముకుని ఉన్నారు. భవిష్యత్తులో కూడా చాలామంది ఉద్యోగాలు సాధించేందుకు ఇక్కడ సాధన చేస్తున్నారు. ?2011 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో, ఈ మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌కు జిల్లా కలెక్టర్, కమిషనర్ ప్రారంభించడం జరిగింది.?అంతేకాకుండా అప్పటి సీఐ, ఎస్సై కూడా ఈ టోర్నమెంట్‌లో పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అప్పట్లో గ్రామ పంచాయతీ, అధికారుల ప్రోత్సాహంతో ఈ ఆట స్థలం ప్రసిద్ధి చెందింది. ఇటీవల ఈ క్రీడా స్థలం ప్రక్కన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఆట నియమాల ప్రకారం వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి చుట్టూ సర్వీస్ జోన్ కనీసం 20 అడుగులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఇక్కడ కేవలం 13 అడుగులు మాత్రమే ఉంది. ఇటువంటి పరిస్థితిలో మరింత స్థలాన్ని ఆక్రమించడం లేదా నిర్మాణాల వల్ల సర్వీస్ జోన్ తగ్గినట్లయితే, క్రీడాకారులు ఆడేందుకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ?ఈ క్రీడా ప్రాంగణంలో ఉన్న సర్వీస్ జోన్ నుండి ఎలాంటి నూతన నిర్మాణాలు, రహదారులు నిర్మించకుండా ఆటంకాన్ని నివారించాలి. ?గత 40 ఏళ్లుగా అధికారుల అభినందనలు పొందుతూ వస్తున్న ఈ స్థలాన్ని గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, తల్లాడ వాలీబాల్ క్రీడా ప్రాంగణం గా గుర్తిస్తూ గ్రామ పంచాయతీలో అధికారిక తీర్మానం ఆమోదించి, స్థలాన్ని పూర్తిగా క్రీడలకే కేటాయించాలి.?క్రీడాకారుల భవిష్యత్తును కాపాడేలా సానుకూల నిర్ణయం తీసుకుని, తగిన తీర్మాన ప్రతిని అందించగలరని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో చల్లా వెంకట్, ధరావత్ కృష్ణ, మొక్క సైదులు, షేక్ మెహరాజ్, నాయకులు షేక్ యూసుఫ్, జూకూరి శ్రీను, నాగేశ్వరరావు,సంపత్, పెరిక శ్రీను, గుంటుపల్లి రవి, కృష్ణ,మనోజ్, పుల్లారావు, అజయ్ చక్రవర్తి,శివ, మదార,పాల్గొన్నారు.



# ఎన్నికల నేపథ్యంలో గూటాల గ్రామంలో పోలవరం డీఎస్పీ యు. రవిచంద్ర, ఆధ్వర్యంలో అవగాహన

**పోలవరం మీ వార్త అక్టోబర్ 16ఏలూరు**
జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, పోలవరం డీఎస్పీ యు. రవిచంద్ర, పోలవరం ఎస్సై పి. అప్పారావు పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోలవరం ఎస్సై, డీఎస్పీ తగిన సూచనలు ఇచ్చారు.అనంతరం గూటాల గ్రామంలో గ్రామస్తులతో ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని విధాలా భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో యువతతో పాటు గ్రామస్తులు ఎటువంటి గొడవలు, కొట్లాటలు, వివాదాలు లేదా ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.అదేవిధంగా సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, నూతన క్రిమినల్ చట్టాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, బాలలపై జరిగే నేరాల నివారణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సైబర్ నేరాలకు గురైనప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని, మహిళలు మరియు బాలల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు



సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ప్రశాంతమైన, స్వేచ్ఛాయుతమైన మరియు పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని పోలవరం పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

# మాదకద్రవ్యాలకు నో చెప్పండి






**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,అక్టోబరు 16 :** స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 18 వ ఆంధ్ర బెటాలియన్, ఎన్ సి సి, కాకినాడ ఆధ్వర్యంలో సంయుక్త వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు "డ్రగ్స్ వద్దు" అనే నినాదంతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సందేశాన్ని అందించారు. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువతలో సామాజిక బాధ్యత మరియు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేజర్ మోహమ్మద్ ఆసిఫ్, మేజర్ శశి మెహతా, సిబ్బంది పాల్గొన్నారు.

# సాయిబాబాను ఘనంగా సత్కరించిన నెలపర్తి నాగరాజు



**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి,**అనకాపల్లి జిల్ల్ నా = జ్రా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా ఆఫీస్ నందు మర్యాద పూర్వకముగా కలసి నాకు అనకాపల్లి జిల్లా నా జ సెల్ కార్యదర్శిగా నియమించినందులకు గాను సాయి బాబా గారిని శాలువాతో సత్కా రించి పూల బొకే తో అభినందనలు తెలియజేయడం జరిగినది .మరియు జగతా శ్రీను గారికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమములో మండల వాణిజ్య విభాగ అధ్యక్షులు ఆడారి నూకరాజు నల్లబెల్లి సత్యనారాయణ గల్లా నాగు పాల్గొన్నారు.

# టేకు చెట్ల నరికివేతపై కలెక్టర్ సీరియస్!

## కల్లూరు మండలంలో మరో ఘటన.. అధికారుల తీరుపై చర్చ..?

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.17.10.2026**
మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలో టేకు చెట్ల నరికివేత ఘటన కలకలం రేపుతోంది. గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న హెల్త్ సెంటర్ వద్ద రెండు టేకు చెట్లను నరికివేసినట్లు సమాచారం. ఈ ఘటనలో గ్రామపంచాయతీ సిబ్బంది పాత్రపై చర్చ జరుగుతోంది.ఇప్పటికే కల్లూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని టేకు చెట్ల నరికివేత ఘటనపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన నేపథ్యంలో, తాజాగా ముచ్చవరంలో మరో ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. ఒక ఘటనపై విచారణ కొనసాగుతుండగానే మరోచోట టేకు చెట్ల నరికివేత జరగడంపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, చెట్ల నరికివేతకు అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే చెట్లను తొలగించారా? అనే అంశాలపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.



# పట్టభద్రులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.17.10.2026**
తల్లాడ తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచన పట్టబద్రులందరూ తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తల్లాడ తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరు ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న ఓటర్లులందరూ ఓటు హక్కు చేసుకోవాలని వెల్లడించారు.



# సి సి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కూటమి నాయకులు

**వెలేరుపాడు,అక్టోబర్ 16 (మి వార్తా ప్రతినిధి)**
కోటి 70 లక్షల విలువగల సిసి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన సీసీ రోడ్లు శంకుస్థాపన ఈ కార్యక్రమం రేపాక గోమ్ము పంచాయతీ, తాత్కూర్ గొమ్ము పంచాయతీ ,మేడేపల్లి పంచాయతీ, రామవరం పంచాయతీలలో కోటి 70 లక్షలతో సిసి రోడ్లు శంకుస్థాపన, మేడేపల్లి పంచాయతీల్లో 20 లక్షలు, రామవరం పంచాయతీలో 50 లక్షలు, తాత్కూర్ గోము పంచాయతీలో 60 లక్షలు, రేపాకు గుమ్మ పంచాయతీలు 40 లక్షలు సాంక్షన్ అవడంతో మంగళవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్, కార్యదర్శి కట్టం రాంబాబు, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు ఒలేటి. బాలకృష్ణ,సిపిఐ మండల కార్యదర్శి రాము,సన్నేపల్లి సాయిబాబు, టీడీపీ మాజీ జెడ్పీటిసి శాఖమూరి. సంజీవులు, నూపా.శ్రీరాములు, ఎండి.నయిమ్, కుకునూరు రాంబాబు,సత్తిబాబు రామారావు, జనసేన పార్టీ నుండి వంశి,భాను,శివరాం,అనిల్ కూటమి నాయకులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం పార్టీకి చేరిపోతున్న వైయస్సార్ పార్టీ నాయకులు.




**రౌతులపూడి అక్టోబర్ 16 :( మీ వార్త న్యూస్ ప్రతినిధి** రౌతులపూడి మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీని విడిచి అధికార తెలుగుదేశం పార్టీకి వలసలు వెళుతున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కత్తిపూడి సత్రం చైర్మన్ సోమారౌతు చంద్ర మౌళి ఈ పరిణామాలకు మండలంలో కీలక బాధ్యత వహిస్తున్నారు. ఎస్ పైడిపాల మాజీ సర్పంచ్ వైయస్సార్ పార్టీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, వైయస్సార్ పార్టీలో కీలక పదవులు చేపట్టిన గొల్లు వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి మరియు రాఘవపట్నం వైఎస్ఆర్ పార్టీ నాయకులు చెన్నాడ సత్యనారాయణ ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎస్ పైడిపాల మాజీ సర్పంచ్ జిగిరెడ్డి సత్తిబాబు, గొల్లు వెంకటరమణ 100 మంది కుటుంబాల వారితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీడ్కోలు చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ జెడ్ పి టి సి చెన్నాడ సత్యనారాయణ రాఘవపట్నం గ్రామం నుండి సుమారు 50 కుటుంబాలతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా అందరికీ తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం వంటి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలియజేశారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారం మరియు గ్రామాల అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా అన్నారు. నాయకులు ప్రజలు తెలుగుదేశం పార్టీ విధివిధానాలు నచ్చడంతో పార్టీలు చేరే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైయస్సార్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో తెలుగుదేశం పార్టీ అధిక స్థానాలను కైసు చేసుకొనే అవకాశం ఉందని రాజకీయ పండితులు అంటున్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ములగపూడి మాజీ సర్పంచ్ తమరాల సత్యనారాయణ, తాజా మాజీ ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, ఎస్ పైడిపాల టిడిపి నాయకులు గుళ్ళ పెద్ద దివాణం, ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, టిడిపి యువ నాయకులు పైల వేణుగోపాల్ పసగడుగుల రమణ, వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# టీడీపీకి గుడ్‌బై.. వైసిపి లో చేరిన జెట్టి అరుణ్

**కుకునూరు అక్టోబర్ 16 (మి వార్తా ప్రతినిధి)** .మండలంలో కుక్కునూరు పంచాయితీ పరిధిలో కొర్లకుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన జెట్టి అరుణ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు... ఈ సందర్భంగా ఆయనకు మండల పార్టీ అధ్యక్షుడు తాండ్ర రాజేష్, ఉపాధ్యక్షుడు మాదిరాజు వెంకన్నబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు...ఈ సందర్భంగా జెట్టి అరుణ్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు...అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు... ముఖ్యంగా వాలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ వ్యవస్థనే నిర్వీర్యం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు... ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వ పాలన పట్ల అసంతృప్తితో ఉన్నానని



అరుణ్ తెలిపారు... ప్రజలకు సంక్షేమ పాలన అందించగల నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నన్న నమ్మకంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు జెట్టి అరుణ్ వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గం అధ్యక్షులు మల్లేలా చంటి నాయుడు, మండల ఉపాధ్యక్షుడు రాయి సత్యనారాయణ , కుచర్లపాటి చిన్న నారసింహారాజు ,వేల్పుల శ్రీనివాస్ , రాయి మధు , పగిలా అల్లేష్ , ఎ .నిమచ్చ మల్లేష్ గ మరియు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

# కివ్వకలో ఘనంగా సరస్వతీ దేవి పూజ.. చిన్నారులకు అక్షరభ్యాసం




**కుక్కునూరు, అక్టోబర్ 16 (మి వార్తా ప్రతినిధి )** మండలంలో కివ్వక గ్రామంలో దసరా నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రం సరస్వతి దేవికి విశిష్టమైన రోజు కావడంతో సరస్వతీ దేవి పూజ కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విద్య, జ్ఞానానికి ప్రతీక అయిన సరస్వతీ దేవిని ఆరాధిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, ఉచితంగా పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. గురుస్వామి బట్టు వీరబాబు భక్తి, విద్య, సత్ప్రవర్తన ప్రాముఖ్యతను వివరిస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ విద్య, విజ్ఞానం, జ్ఞానానికి ప్రతీకగా భావించే సరస్వతీ దేవికి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు సాగాయి. సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జ్ఞానంతో పాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు.చిన్నారులకు అక్షరాభ్యాసం.. ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ సరస్వతీ పూజను పురస్కరించుకుని చిన్నారులకు ఆచార్యులు సాయి అక్షరాభ్యాసం చేయించారు. సంప్రదాయబద్ధంగా అక్షరాలు దిద్దిస్తూ చిన్నారుల విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. అనంతరం చిన్నారులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. చిన్నతనం నుంచే పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, విద్య ప్రాధాన్యతను తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించడంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తి మార్గంలో నడుస్తూ.. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలిఈ సందర్భంగా గురుస్వామి బట్టు వీరబాబు ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తూ, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సత్యం, ధర్మం, దయ, మానవత్వం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. దైవభక్తి మనిషిలో మంచి ఆలోచనలు, సత్ప్రవర్తనను పెంపొందిస్తుందని వివరించారు. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు, వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. సరస్వతీ దేవి ఆశీస్సులతో విద్యార్థులందరూ విద్యారంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆధ్యాత్మికతతో పాటు విద్యా ప్రోత్సాహంలి సరస్వతీ దేవి పూజతో పాటు అక్షరాభ్యాసం, ఉచిత పుస్తకాలు, పెన్నుల పంపిణీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు విద్యా ప్రాధాన్యతను చాటిచెప్పారు. గురుస్వామి బట్టు వీరబాబు సందేశం, ఆచార్యులు సాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలతో కివ్వక గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. విద్యార్థులు, చిన్నారులకు ప్రోత్సాహం అందించేలా కార్యక్రమం కొనసాగింది.ఈ కార్యక్రమం లో గురుస్వామి బట్టు వీరబాబు, భవాని రాయి కృష్ణర్జునరావు, ఇనుముల గోపరాజు భవాని మాతాలు భక్తులు పాల్గొన్నారు.

# ఇందుర్తిలో వైభవంగా దుర్గామాత కుంకుమ పూజలు..

## సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**చిగురుమామిడి అక్టోబర్ 16 (మీ వార్త విలేకరి):** మండలంలోని ఇందుర్తి గ్రామంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవారాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేదపండితులు గుజ్జ రాజన్న శర్మ మరియు గుజ్జ కిరణ్ శర్మ ల సమక్షంలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుండి మహిళలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు సమర్పించి తరించారు. శుక్రవారం నాడు అమ్మవారు జ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతి దేవి (స్కందమాత) రూపంలో దివ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి విశేష పూజలందుకున్నారు. అమ్మవారి అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పూజా కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమ నిర్వహణ ఎంతో




ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతమైంది.

# చినతాడేపల్లిలో మెగా వైద్య శిబిరం



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** చినతాడేపల్లిలో టీడీపీ నాయకులు గన్నమని అనిల్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు.టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కార్డియాలజిస్ట్, గైనకాలజిస్ట్, ఆంకాలజిస్ట్‌లతో పాటు జనరల్ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు.సుమారు 200 మంది రోగులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిటికెన శ్రీనివాస్, అత్యంత తాతయ్య, పరిమి వెంకటేశ్వరరావు, గన్నమని రాజేష్, జాస్తి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మాత సరస్వతీ అలంకారంలో భక్తులకు దర్శనం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి(** ఏలూరు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో 59వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా గురువారం వాసవి మాత విశేష అలంకారంలో సరస్వతీ అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. వీణాపాణియై, హంసవాహనంపై కొలువైన అమ్మవారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.విద్యాభివృద్ధి, జ్ఞానసిద్ధి కోసం సరస్వతీ స్వరూపిణిగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారు.ఆలయంలో కుంకుమ పూజలు, లక్ష కుంకుమార్చన, ప్రత్యేక హోమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

## డీఎం అండ్ హెచ్‌ఓ ఎం రవిబాబు



**పెంటపాడు, అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** మండల కేంద్రమైన పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భీమవరం డీఎం అండ్ హెచ్‌ఓ ఎం రవిబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రసూతి సేవలు, టీబీ, కుష్టు నివారణపై సర్వే ఎలా నిర్వహిస్తున్నారు, మందులు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారనే వివరాలను వైద్యురాలు మౌనిక నుండి అడిగి తెలుసుకున్నారు.వైద్యులు అందించే సేవతో పాటు ఆరోగ్య సిబ్బంది అంతా బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రాథమిక కేంద్రాల్లో పనిచేసే వారంతా మానవసేవే మాధవసేవగా గుర్తించి వైద్య సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, ఎంపీ హెచ్‌ఓ వెంకట్రావు, పబ్లిక్ హెల్త్ నర్స్ టీబీఎస్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఎం తేజ నాద్, హెచ్‌ఎస్ గంగాధర్, ఆరోగ్య సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

# మచిలీపట్నం యు పి హెచ్ సి పరిధి 7వ.సచివాలయం వద్ద “ఫ్రైడే డ్రై డే “



**మచిలీపట్నం అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)** మచిలీపట్నం చిలకలపూడి 2. యు పి హెచ్ సి పరిధి7.వ సచివాలయం వద్ద ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేయటం జరిగింది. మరియు యు పి హెచ్ సి వైద్యా అధికారి డా.. శ్రావ్య ఆధ్వర్యంలో ఆయిల్ బాల్స్ మురుగు గుంటలలో వేయటం జరిగింది. మరియు ఫీవర్ సర్వే చేయటం జరిగింది. ప్రజలకు దోమలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో డా ..శ్రావ్య , హెల్త్ సూపర్ వైజర్స్ బి. రాఘవేంద్ర రావు, భట్రాజు సూరిబాబు , హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వర రావు , ఏ ఎన్ ఎమ్ రాణి , అంగన్ వాడి టీచర్ జి. పద్మ వతి, ఆశ వర్కర్ ఏ. పద్మ పాల్గొన్నారు

# వెంకట్రామ్మన్నగూడెం ఉద్యాన కళాశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్ ప్రారంభం




**తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** వెంకట్రామన్నగూడెం లోని ఉద్యాన కళాశాలలో, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఏఆర్) సహకారంతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె. ధనుంజయ రావు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ బి. ప్రసన్న కుమార్, విశ్వవిద్యాలయం విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ టి. పద్మలత, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్‌బివి చలపతిరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ “ఆధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, ఇంటరాక్టివ్ లెర్నింగ్ టూల్స్ మరియు అధునాతన విద్యా సౌకర్యాలతో రూపొందించిన ఈ స్మార్ట్ క్లాస్‌రూమ్ విద్యార్థుల్లో చురుకైన అభ్యసనాన్ని ప్రోత్సహించడంతో పాటు, బోధనా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఈ సదుపాయం దోహదపడుతుంది” అని తెలిపారు. విద్యా మౌలిక సదుపాయాలను సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతరం ఆధునికీకరిస్తూ మెరుగైన లెర్నింగ్ వాతావరణాన్ని కల్పించేందుకు ఐసిఏఆర్ దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటుకు సహకరిస్తూ, వాటిని అనుసంధానం చేయడం ద్వారా అనుభవజ్ఞులైన ప్రఖ్యాత ప్రొఫెసర్ల పాఠాలు వినే అవకాశం స్మార్ట్ క్లాస్ రూమ్స్ ద్వారా ఆయా విశ్వవిద్యాలయాల విద్యార్థులకు లభిస్తుంది.

# శ్రీ కొండలమ్మ అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనము

**గుడివాడ అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ది.11.10.2026 నుండి 20.10.2026 వరకు శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవములులో భాగముగా ది.15.10.2026 వ తేదీ రాత్రి 7.30 ని××లకు కూచిపూడి నాట్యాలయం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి 8.30 ని××లకు విజయవాడ వారిచే శ్రీనివాస కళ్యాణం సీను, రాత్రి 10.00 ని××లకు 1. వారణాసి సీను, 2.కాటి సీను 3.రామాంజనేయ యుద్ధం 4.గయోపాఖ్యానం 5.మాయల పకీరు సంగు సీను వంటి సాంస్కృతిక కార్యక్రమములు జరిగినవి.ది.16.10.2026 కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ది.11.10.2026 నుండి 20.10.2026 వరకు శ్రీదేవి శరన్నవరాత్రులు మహోత్సవములులో భాగముగా ఈరోజు ఆశ్వయుజ శుద్ధ షష్టి శ్రీ అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం సందర్భముగా శ్రీ కొండలమ్మ అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనము ఇవ్వటం జరిగినది. ఈరోజు ఉదయం ప్రాతకాలార్చన, ఉ గం. 8-30 ల నుండి శ్రీ అమ్మవారికి సహస్రనామార్చన, సకల విద్యాభివృద్ధికి శ్రీ సరస్వతి మూల మంత్ర హవనములు చేసినారు. దేవస్థానం అర్చకులు మరియు యాజ్ఞిక బ్రహ్మ విద్యార్థిని, విద్యార్థులచే సరస్వతి దేవి పూజ కార్యక్రమం చేయించినారు. పూజ అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి చైర్మన్ మరియు సభ్యులచే విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాల (పెన్నులు, పుస్తకములు, స్కేలు, పెన్సిల్, రబ్బర్, చక్మార్) వితరణ కార్యక్రమశీ జరిగినది. ఈ కార్యక్రమం అనంతరం తీర్ధ ప్రసాద వితరణ జరిగినవి. శ్రీ అమ్మవారి దేవస్థానంలో భక్తులు వేల సంఖ్యలో విచ్చేసి శ్రీ అమ్మవారిని దర్శించుకొనినారు.ఈరోజు గుడివాడ రూరల్ సి ఐ ఎస్ ఎల్ ఆర్ సోమేశ్వరరావు ఆధ్వర్యములో గుడ్లవల్లేరు
ఎస్సై కొండపల్లి సురేష్ వారి సిబ్బందితో దేవస్థానంలో ఎటువంటి అవాశీచనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు చేసినారు. ఈ కార్యక్రమములో దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు , సభ్యులు శ్రీమతి తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, శ్రీ కళ్ళేపల్లి సుగుణ శేఖర్, శ్రీ వడ్లమూడి రవీంద్ర బాబు, శ్రీమతి పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మి పావని, ఉస్తేల కోటేశ్వరమ్మ, పెన్నేరు వీర వెంకట నాగ లీల శేఖర్ మరియు ఎక్స్- అఫీషియో మెంబర్ శ్రీ రుద్రపాక శరశ్చశ్రీద్ర శివ సంతోష్ శర్మ శ్రీ అమ్మవారి దేవస్థానంలో ఏర్పాట్లను పర్యవేక్షించి కుంకుమ పూజ మరియు హోమములో పాల్గొనినారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవములు సందర్భముగా విచ్చేయు భక్తులకు ఏవిధమైన అసౌకర్యము కలుగకుండా దేవస్థానము పరిసర ప్రాంతములలో పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించడ మైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్ మెంట్ డా×× గురురాజు ప్రభుత్వ ఉచిత హోమియో వైద్య శిబిరం వారితో ఫ్రీ మెడికల్ క్యాంప్ లు, పోలీస్ డిపార్ట్మెంట్ వారితో ఔట్ పోస్ట్, మెడికల్ ౚ హెల్త్ డిపార్ట్మెంట్ వారితో ఫ్రీ మెడికల్ క్యాంప్ లు మరియు అగ్ని మాపక శాఖ వారు తగు ముందస్తు జాగ్రత్త ఏర్పాటు చేయటమైనది.ఈరోజు సాంస్కృతిక కార్యక్రమములు మధ్యాహ్నం గం..12.30 లకు శ్రీ విజయదుర్గా మహిళా కోలాటం సమాజం గుడివాడ వారిచే మహిళా కోలాటం, మధ్యాహ్నం గం..3.30 లకు శ్రీ వేణుగోపాల భజన సమాజం వడ్లమన్నాడు వారిచే భజన వంటి కార్యక్రమములు జరిగినవి. అనంతరం సాయంత్రం గం×× 5.30 ని××లకు నుండి సాయంకాలార్చన, ఉంజల్ సేవ, పంచహారతులు మంత్ర పుష్పములు, చతుర్వేదస్వస్తి అనంతరం తీర్ధ ప్రసాద వితరణ జరిగినది. రాత్రి గం..7.30 లకు మహి కూచిపూడి నాట్యాలయం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి 8.30 ని××లకు విజయవాడ వారిచే మోహిని విజయం సీను, రాత్రి 10.00 ని××లకు విజయవాడ వారిచే మోహిని భస్మాసుర నాటకం వంటి సాంస్కృతిక కార్యక్రమములు



జరుగునని దేవస్థానకార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలిపియున్నారు.అదేవిధంగా ది.18.10.2026 వ తేదిన శ్రీ కొండలమ్మ దేవస్థానంలో కుంభం పోయుట, గ్రామోత్సవం, 3000 మందికి అఖండ అన్నసమరాధన జరుగున్నది. కావున యవద్మంది భక్తులు శ్రీ అమ్మవారి దర్శించెదరు. అని తెలిపియున్నారు. అని దేవస్థానకార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావుతెలిపారు.శ్రీమాత్రే నమః
శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుచున్న శ్రీ దేవి శరన్నవరాత్ర ఉత్సవములలో భక్తులకు ప్రసాదం పంచు నిమిత్తం ఆయుష్య ఫుడ్స్ అధినేత శ్రీమతి వెనుగండ్ల లక్ష్మి ప్రసన్న రామన్నపూడి వారు, ఓ జి ఎన్ ఐ ఈ ఎస్ సి ఓ ప్రైవేట్ లిమిటెడ్,.అధినేత శ్రీ వెనిగండ్ల మదన్ కిషోర్ ఇరువురు 21000-00 విరాళంగా సమర్పించి ఉన్నారు దాతలను చైర్మన్ ఈడే మోహన్, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు శేషవస్త్రాలతో సత్కరించి శ్రీ అమ్మవారి చిత్రపటం ప్రసాదములు అందజేసినారు.

# ఎల్.ఓ.సీలు అందజేసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.

**జీలుగుమిల్లి..( మీ వార్త ప్రతినిధి)** బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముగ్గురు బాధితులకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరైన ఎల్.ఓ.సీ (గ్రూజ) పత్రాలను అందజేశారు. బుట్టాయిగూడెం మండలానికి చెందిన తెల్లం దుర్గమ్మకు రూ.3.50 లక్షలు, పోలవరం మండలం కోరుటూరు గ్రామానికి చెందిన కడాల అర్జున్ రెడ్డికి రూ.3.91 లక్షలు, టి.నర్సాపురం మండలానికి చెందిన కాల్నిడి చంద్రరావుకు రూ.3.45 లక్షల విలువైన ఎల్.ఓ.సీ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ముగ్గురికి కలిపి మొత్తం రూ.10.86 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**



**మాట్లాడుతూ**
అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరికీ వైద్యం అందకుండా ఉండకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జట్ల సత్యనారాయణ, చింతలపూడి నవీన్, తొమ్మిదేళ్ల శ్రీను, కంపసాటి రమేష్, మధు, రాజేష్, చక్రవర్తి, పూనెం రాజా, పోతురాజు, ఏసుబాబు, రూపా సత్యనారాయణ, చిర్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు..

# నా నేలతల్లి అభివృద్ధికి కృషి చేయాలనుకుంటున్నా: గొర్రెల శ్రీధర్

## మున్సిపల్ చైర్మన్ అంటే ఇష్టం

**తాడేపల్లిగూడెం అక్టోబర్ 16 (మీ వార్త ప్రతినిధి)**
గతంలో అధికారం చేపట్టిన వెంటనే కార్పొరేషన్ చైర్మన్ ఇస్తానని టిడిపి అధిష్టానం చెప్పగా దానిని తృణప్రాయంగా తోసిపుచ్చానని, మున్సిపల్ చైర్మన్ అంటే తనకు ఇష్టం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. తాను పుట్టిన నేలతల్లికి, పట్టణ ప్రజలకు సేవ చేయాలి, అభివృద్ధి చేయాలనేదే తన లక్ష్యం అన్నారు.మున్సిపల్ చైర్మన్ అనేది తన కల అని, పట్టణ అభివృద్ధికి ప్రజల అభ్యున్నతికి కృషి చేయడమే తన లక్ష్యంగా పేర్కొన్నారు. 2014లోనే తాను మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిన్నారు. కానీ అధిష్టానం తనను వెనక్కు తగ్గమని చెప్పడంతో పార్టీ మీద విధేయతతో విరమించుకున్నానని గుర్తు చేశారు. తాను మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి శక్తివంతనతో కృషి చేశానని తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచానని ఉద్ఘాటించారు. 20 సంవత్సరాలుగా తాడేపల్లిగూడెంలో జనరల్ రిజర్వేషన్ మాత్రమే జరుగుతుందన్నారు. మరో 20 సంవత్సరాలు అయినా బీసీ రిజర్వేషన్ జరుగుతుందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలకు 34 శాతం నుంచి 40 శాతం వరకు రిజర్వేషన్లు పెంచుతానని



చెప్పిన మాట ప్రకారం తాడేపల్లిగూడెంలో పునరాలోచన చేసి బిసి రిజర్వేషన్ తోపాటు చైర్మన్ అభ్యర్థిగా తనను ప్రకటించాలని శ్రీధర్ తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ను కోరుతున్నట్లు మీడియా ముఖంగా తెలుపుతున్నానన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తనకు సోదర సమానులని, ఆయన ఎల్లవేళలా తమను కలుపుకుంటూ వెళ్తున్నారని, తనను ఒక తమ్ముడిలా భావించి ప్రతి కార్యక్రమంలో తనును భాగస్తులను చేస్తున్నారని తెలిపారు.తామంతా కలిసే పని చేస్తామని అధిష్టానం ఏం చెబితే దానికి కట్టుబడి పని చేస్తానన్నారు.కష్టపడి పని చేసే వారిని గుర్తించి పార్టీ న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, పెంటపాడు మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, ముదునూరు సొసైటీ చైర్మన్ దాసరి అప్పన్న, గంధం సతీష్, దాసరి కృష్ణవేణి, ఎరుబండి సతీష్, భోజంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తకి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా...

## చెక్ పంపిణీ చేసిన టీడీపీ నేతలు...

**వర రామ చంద్రపురం, అక్టోబర్ 16 మీ వార్త ప్రతినిధి**
వర రామ చంద్రపురం మండలం ములకలపల్లి పంచాయతీ జల్లి వారిగూడెం గ్రామానికి చెందిన చెందిన జల్లి,రాజు ఇటీవల విద్యుత్ షాక్ కి గురిఅయి ఆసుపత్రిలో చికిత్సకి సుమారు రెండు లక్షల రూపాయలు పై ఖర్చు అవ్వడం జరిగింది.మూడు నెలల క్రితం రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల.శిరీష దేవి విజయ్ భాస్కర్ వి ఆర్ పురం మండలం జల్లివారిగూడెం గ్రామంలో ఇంటి ఇంటికి తెలుగుదేశం కార్యక్రమం పర్యటన సమయంలో జల్లి,రాజు ను పరామర్శించి సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.శు



క్రవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు బొర్రా నరేష్ సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య సీనియర్ నాయకులు రాజేంద్రప్రసాద్ పాయం రామారావు పాల్గొని లక్ష 11 వేల రూపాయల చెక్ ను లబ్ధిదారుడికి



అందజేశారు.ఈ కార్యక్రమం లో ములకలపల్లి పంచాయితీ నాయకులు. జల్లి నవేష్.పూనెం శ్రీను.జల్లి బాబురావు.జల్లి లక్ష్మణ్.కిరణ్.మోసం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మలికిపురం జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా దిరిశాల బాలాజీ



**?మలికిపురం అక్టోబర్ 16(మీ వార్త విలేఖరి)** మలికిపురం మండల జడ్పీటీసీ అభ్యర్థిగా దిరిశాల బాలాజీ గారు పోటీ చెయ్యాలని తన అభిమానులు తన అనుచరులు కోరుకుంటున్నారు. 2019లో రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీ గెలుపొందడానికి బాలాజీ ముఖ్యమైన పాత్ర పోషించారు. అదేవిధంగా, 2024లో దేవ వరప్రసాద్ గెలుపొందడానికి ఆయన చేసిన కృషి, ప్రయత్నాలు నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు. తను చేసిన కృషి ఫలితంగా జడ్పీటీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుకుంటున్నాను.

# జనసేన బలంగా ఉన్న స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి 100 శాతం విజయమే లక్ష్యంగా పనిచేయాలి-- ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ



**పి. గన్నవరం( మీ వార్త విలేఖరి)** పి. గన్నవరం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ అమలాపురం పార్లమెంట్ స్థానిక సంస్థల కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, కమిటీలోని సభ్యులందరూ తమ తమ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ బలంగా ఉన్న స్థానాలను గుర్తించి, అక్కడ సమర్థులైన అభ్యర్థులను నిలబెట్టి 100 శాతం విజయాన్ని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యత, అవకాశం కల్పించాలని అన్నారు. పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో అభ్యర్థుల విజయావకాశాలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా, ప్రతి ఒక్కరూ తమ తమ నియోజకవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సమర్థవంతమైన అభ్యర్థులను గుర్తించి, వారి జాబితాలను ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచాలని సూచించారు. పార్టీ విజయావకాశాలను పెంపొందించేలా క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేస్తూ, పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తూ, సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ పరిధిలోని నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, నిర్వాహక దళ్ సభ్యులు, సపోర్టింగ్ టీమ్ సభ?

# పెడన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన

## జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐ పి ఎస్



**పెడన అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)**పెడన మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను కృష్ణా జిల్లా ఎస్పీ శ్రీ వి. విద్యాసాగర్ నాయుడు, ఖీూ గారు పరిశీలించారు.ఈ సందర్భంగా పెడన మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రంతో పాటు, పెడన 2వ సచివాలయం పరిధిలోని 28వ వార్డు దాదాగుంట వద్ద ఉన్న కేంద్రాన్ని, కానూరి నగర్ రివర్స్ కాలనీలోని 3వ సచివాలయం వద్ద ఉన్న నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, నామినేషన్ల దాఖలు కోసం వచ్చే అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తి అప్రమత్తతతో పనిచేస్తుందని, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్పష్టం చేశారు.

# జడ్డంగి సంత మార్కెట్ వద్ద కారు స్కూటీ ఢీ

**ఒకరికి రక్తగాయాలు.. ధ్వంసమైన వాహనాలు**

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి**

**రాజవొమ్మంగి :** జడ్డంగి సంత మార్కెట్ సమీపంలో కారు, మోటారు స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి రక్తగాయాలయ్యాయి. ఈ ఘటనలో స్కూటీ తీవ్రంగా ధ్వంసమవగా, కారు ముందు భాగం కూడా దెబ్బతింది. ప్రమాద స్థలంలో వాహనాల విడిభాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.జడ్డంగి ప్రాంతంలో రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంత మార్కెట్ పరిసరాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించి, వాహనదారులు, పాదచారుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# భీమేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు..

.శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి

**గుడివాడ అక్టోబర్ 16(మీ వార్త ప్రతినిధి)**
సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము...చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ అమ్మవారి చల్లని దీవెనలు గుడివాడ ప్రజలందరిపై ఉండాలి:ఎమ్మెల్యే, గుడివాడ పట్టణంలోని బంటుమిల్లి రోడ్డులో ప్రసిద్ధిగాంచిన శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రాము, రావికి దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సమర్పించనున్న పట్టు వస్త్రాలను శిరస్సుపై ఉంచుకొని ఎమ్మెల్యే రాము ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. శ్రీ భీమేశ్వర స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.మూలా నక్షత్రం సందర్భంగా ఆలయ మండపంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము, రావి పాల్గొన్నారు. చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకుని



వారి చేత అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు. విద్యారంభం చేసుకుంటున్న చిన్నారులను ఆశీర్వదించి, వారికి పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే రాము, రావికి వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి ఉత్సవ ప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. ప్రజలందరికీ విజయదశమి శు భాకాంక్షలు తెలిపారు. సరస్వతీ దేవి ఆశీస్సులు పొందే పవిత్రమైన మూలా నక్షత్రం రోజున సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అక్షరాభ్యాసం ద్వారా విద్యా ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న చిన్నారులందరూ సరస్వతీ దేవి కృపతో విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గుడివాడ పట్టణానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చిన్నారులకు సూచించారు.



శ్రీ భీమేశ్వర స్వామివారి దేవస్థానంలో అమ్మవారి ఆశీస్సులతో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి చల్లని దీవెనలు గుడివాడ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ పట్టపు చిన్న, ఈవో కందుల గోపాలరావు, వేద పండితులు భైరవబొట్ల విజయకుమార్ శర్మ, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, దేవరపల్లి కోటి,గడ్డం ప్రకాష్ దాస్, పొట్లూరి కృష్ణారావు, ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు పి. విశ్వనాథ్ రావు,తీళ్ళ సూర్యనారాయణ,దొండపాటి నాగరాజు,గేదెల కళ్యాణి,వి. మాధురి లత,వై. సుశీల,మాదల సునీత,ముప్పిడి ఉమా,పి. శ్రీవిద్య,మామిళ్ళపల్లి సోమేశ్వరరావు, పెద్ద సంఖ్యలో భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

# కోతల ప్రకంపనలు!

**విద్యుత్ శాఖలో తాజా పరిణామాల కలకలం.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై సీఎం సీరియస్**
**వెనువెంటనే 'యాదాద్రి'పర్యవేక్షణకు ఐదుగురు ఐఏఎస్‌లతో కమిటీ.. ప్లాంట్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వనున్న కమిటీ**
**ఇంధన శాఖ ప్రత్యేక సీఎస్ మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్‌ను పక్కన పెట్టడంపై సందేహాలు**
**నివేదిక ఆధారంగా ఇద్దరు ఉన్నతాధికారులపై వేటు పడుతుందనే చర్చ.. మరోవైపు హుటాహుటిన యాదాద్రికి వెళ్లిన మిత్తల్, హరీశ్**
**జెన్‌కో డైరెక్టర్లూ అక్కడే మకాం..సీఎం వ్యాఖ్యలపై అంతర్గత సమావేశంలో చర్చ!**
**విధుల్లో నిర్లక్ష్యం ఆరోపణలతో యాదాద్రి సీఈ సస్పెన్షన్.. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి!**

**హైదరాబాద్:** ఇంధన శాఖలో విద్యుత్ కోతల ప్రకంపనలు మొదలయ్యాయి. కోతలు కొనసాగితే ఐఏఎస్‌లపై సైతం చర్యలకు వెనుకాడనని బుధవారం ముఖ్యమంత్రి హెచ్చరిం చారు. వెనువెంటనే గురువారం యాదాద్రి థర్మల్ ప్లాంట్ పర్యవేక్షణ, పరిశీలనకు ప్రభుత్వం ఐదుగురు ఐఏఎస్‌లతో కమిటీ వేసింది. దీంతో ఉన్నతాధికారులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్ హుటాహుటిన యాదాద్రి ప్లాంట్‌కు వెళ్ళారు. ఇక జెన్‌కో డైరెక్టర్లంతా అక్కడే మకాం వేశారు. మరోవైపు యాదాద్రి థర్మల్ కేంద్రం చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను జెన్‌కో ఎండీ సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. మరోవైపు యాదాద్రి కేంద్రంగా ఇంధనశాఖ, జెన్‌కో ఉన్నతాధికారులు రహస్యంగా సమావేశమైనట్టు తెలిసింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై అధికారులు సీరియస్‌గా చర్చించినట్టు తెలిసింది. సీఎం వ్యాఖ్యలపై కొందరు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా ఈ భేటీ జరిగిందనే సమాచారంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దీనిపై ఆరా తీసినట్టు తెలిసింది. మొత్తం మీద తాజా పరిణామాలు విద్యుత్ శాఖలో తీవ్ర కలకలం రేపుతుండగా, కొందరు కీలక అధికారులపై చర్యలు తప్పవనే చర్చా ఇంధన శాఖలో జరుగుతోంది.



### యాదాద్రి చుట్టూ వివాదం

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం సాక్షిగా వివాదం మొదలైంది. బొగ్గు కొరత తీవ్రంగా ఉందని అధికారులు చెబుతున్నారు. 4 వేల మెగావాట్ల ప్లాంట్ల నుంచి కేవలం సగటున 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా జరగడం లేదు. మిగతా ప్లాంట్లూ బొగ్గు కొరతను ఎదుర్కొంటున్నాయి. జల విద్యుత్ ప్రాజెక్టులు పడకేశాయి. కొందామన్నా బహిరంగ మార్కెట్‌లో కరెంటు అంత సులభంగా అందుబాటులో లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అనధికారిక కోతలు అమలవుతున్నా యి. కరెంటు కోతలపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండగా, ప్రజలు సైతం నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.
దీంతో సీఎం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జెన్‌కో ఎండీపై సీరియస్ అయ్యారు. 4 వేల మెగావాట్ల ప్లాంట్ సరిగా పని చేయకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో ఐదుగురు ఐఏఎస్ అధికారులతో కమిటీ వేసింది. చెవ్వూరు హరికిరణ్ (ఎక్సైజ్ కమిషనర్), వెంకటేశ్ ధోత్రే, (విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి), రాహుల్ రాజ్ (సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, రిజిస్ట్రార్), జెండాగే హనుమంత్ కొండిబా (ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో), కిల్లు శివకుమార్ నాయుడు (ఆర్అండ్ఆర్, భూసేకరణ కమిషనర్)ను కమిటీలో చేర్చింది.

### యాదాద్రిపై దృష్టి.. విస్తృత తనిఖీలు

కొన్నాళ్ళుగా ఇంధనశాఖ, జెన్‌కో ఉన్నతాధికారులు ఇచ్చే నివేదికల్లో విశ్వసనీయత లేదని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ ఐదుగురు అధికారులూ బొగ్గు సరఫరా నుంచి విద్యుదుత్పత్తి వరకు తనిఖీలు నిర్వహించడంతో పాటు యాదాద్రిలో జరిగే పరిణామాలను పరిశీలిస్తారు. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకూ ఈ బృందం యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తుంది. దీని ఆధారంగా ఉన్నతాధికారులపై వేటు వేస్తారనే ప్రచారం జరుగుతోంది. కాగా కమిటీ ప్లాంట్‌లోని నాలుగు యూనిట్లూ పూర్తిస్తాయిలో పని చేస్తున్నాయా? లేదా?.. ఉత్పత్తి తగ్గడానికి కారణాలేమిటి? నాలుగు బొగ్గు సరఫరా వ్యవస్థలు (కోల్ స్ట్రీమ్స్) కూడా పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయా? ఏవైనా అంతరాయాలు ఉంటే వాటికి కారణాలేమిటి? బొగ్గు సరఫరా వ్యవస్థల గరిష్ట సామర్థ్యం ఎంత? ప్రస్తుతం ఎంత మేర సరఫరా జరుగుతోంది? అనే అంశాలను పరిశీలిస్తుంది. ప్లాంట్‌కు అందుతున్న బొగ్గు గ్రేడ్ ఏమిటి? ఆ నాణ్యతకు అనుగుణంగా విద్యుదుత్పత్తి జరుగుతోందా? బొగ్గు నాణ్యతలో తేడాల వల్ల ఉత్పత్తిపై ప్రభావం పడుతోందా? అనే విషయాలను సమీక్షించనుంది.
నాలుగు యూనిట్లకు అవసరమైన స్థాయిలో బొగ్గు సరఫరా అవుతోందా? బొగ్గును బంకర్లలోకి పంపే ప్రక్రియలో కీలకమైన వీఈజీఎఫ్ (వేరియబుల్ గేట్ ఫీడర్ల)లో జామింగ్ సమస్యలు ఏమైనా ఉన్నాయా? వీటివల్ల బొగ్గు సరఫరాకు ఆటంకం కలుగుతోందా? ప్లాంట్‌లో బీహెచ్ఈఎల్ చేపట్టాల్సిన పనులు ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉన్నాయా? వాటి ప్రస్తుత స్థితిగతులు తదితర అంశాలను కమిటీ తనిఖీ చేసి నివేదిక ఇవ్వనుంది. బొగ్గు రేక్‌లను అన్ లోడింగ్ చేయడానికి పడుతున్న సమయం ఎంత? ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలేమిటి? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించనున్నారు.

### ఆ ఇద్దరు ఉన్నతాధికారులపై వేటు లక్ష్యంగా..?

ఐదుగురు సభ్యుల కమిటీ పూర్తి వివరాలతో నివేదిక రూపొందించనుంది. అయితే వీటన్నింటిపైనా కొన్నేళ్ళుగా పట్టున్న ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మిత్తల్, జెన్‌కో ఎండీ హరీశ్‌ను కాదని మరో కమిటీ వేయడంపై అనేక సందేహాలు నెలకొంటున్నాయి. ఈ ఇద్దరి అధికారుల వైఫల్యాన్ని లక్ష్యంగా చేసుకుని, వేటు వేయడానికే కమిటీ వేసినట్టు జెన్‌కో వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### డిప్యూటీ సీఎం ప్రశంసించిన మర్నాడే..!

తాజా పరిణామాల నేపథ్యంలో ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి, జెన్‌కో ఎండీ యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు వెళ్ళారు. జెన్‌కో డైరెక్టర్లంతా వారిని అనుసరించారు. నైనీ బ్లాక్ నుంచి బొగ్గు రప్పించడం, సింగరేణి బొగ్గు పెంచడం, ఉత్పత్తి మెరుగు పర్చడానికే సమావేశం నిర్వహించినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే సీఎం చేసిన వ్యాఖ్యలపై అధికారులు చర్చించినట్టు తెలిసింది. వాస్తవానికి ఒకరోజు ముందే డిప్యూటీ సీఎం విక్రమార్క విలేకరుల సమావేశంలో అధికారుల కృషిని ప్రశంసించారు. ఆ మర్నాడే సీఎం సీరియస్‌గా వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతలోనే ఈ మార్పు ఏమిటి? అనే దానిపై అధికారులు చర్చించినట్టు తెలిసింది. కమిటీ వేయడం వెనుక ఉన్నతాధికారులను తప్పించే లక్ష్యం ఉందనే అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వేసిన కమిటీకి సహకరించకూడదనే చర్చా అధికారులు, సిబ్బందిలో జరిగినట్టు సమాచారం. అయితే తన శాఖలో సీఎం జోక్యం, అధికారుల సమావేశంపై డిప్యూటీ సీఎం భట్టి ఆరా తీసినట్లు తెలిసింది. గురువారం ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడినట్టు విద్యుత్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

# పనులు నాణ్యతతో చేపట్టాలి



**పలు డివిజన్లలో భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్ పాల్...**

**నిజామాబాద్** : నగరంలో చేపట్టబోయే పనులను నాణ్యతతో నిర్మించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 23, 24, 6, 48వ డివిజన్లలో రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్ కు రూ.20 లక్షలు కేటాయించార న్నారు. ఈ నిధులతో ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్ వే కు సంబంధించిన డిపిఆర్ కూడా సిద్ధమవుతుందని చెప్పారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిజామాబాద్ నియోజకవర్గానికి నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా సీడీపీ నిధుల కోసం అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు, స్రవంతిరెడ్డి, సుమిత్ర కిషోర్, విజయ మల్లేష్ యాదవ్, ప్రసన్న శ్యామల సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు.

**భక్తులకు అన్నదానం చేసిన కందగట్ల రాంచందర్.**





**ఎడపల్లి** : ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నాని యాదవ్ ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా స్థానిక సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచందర్ భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

# దుర్గామాత ఆలయంలో ఘనంగా కుంకుమ పూజలు

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు.. అనంతరం అన్నదానం**

**కామారెడ్డి** : కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో





రామారెడ్డి యూత్ పోస్ట్ ఆఫీస్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చనతో భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. దుర్గామాత కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. భక్తి వాతావరణంలో పూజా కార్యక్రమం కొనసాగడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

### యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

కుంకుమ పూజా కార్యక్రమం అనంతరం రామారెడ్డి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. భక్తితో పాటు సేవాభావాన్ని చాటుతూ యూత్ సభ్యులు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. మహిళలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని గ్రామస్తులు పేర్కొన్నారు. కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన యూత్ సభ్యులను పలువురు అభినందించారు.

# విజయ్ దేవరకొండ బాక్సాఫీస్ పూనకం!

## 'రణబాలి' మూవీ రివ్యూ




చరిత్ర పుటల్లో మరుగునపడిపోయిన వీరుల కథలను వెండితెరపైకి తీసుకొచ్చి, వారి పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయడం గొప్ప ప్రయత్నం. ముఖ్యంగా బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఆకలి బాధలు, కరువు కాటకాలు, దోపిడీ, అణచివేత వంటి అంశాలను భావోద్వేగాలతో మేళవించి చెప్పడం అంత సులభం కాదు. అలాంటి ఒక మరుగునపడిపోయిన వీరుడి జీవితాన్ని, పోరాటాన్ని తెరపై ఆవిష్కరించిన చిత్రమే 'రణబాలి'. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించారు. బలమైన చారిత్రక నేపథ్యం, మానవీయ భావోద్వేగాలు, తిరుగుబాటు స్ఫూర్తి కలగలిసిన ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించింది? భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా అంచనాలని అందుకుందా? రివ్యూలో చూద్దాం.

### కథ

బ్రిటిష్ పాలనలో మద్రాస్ ప్రాంతం తీవ్రమైన కరువును చూసిన కాలమది. రాయలసీమ ప్రాంతంలోని సింగనమల ప్రాంతానికి రక్షణగా ఉంటాడు భద్రమల్లన్న స్వామి. ఆ స్వామి ఆశీస్సులతో జన్మిస్తాడు రణబాలి (విజయ్ దేవరకొండ). తన పుట్టుకకు ఓ కారణం ఉంటుంది. తన ప్రజలను కరువు రాక్షసుడి నుంచి కాపాడటం తన కర్తవ్యం. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ రూపంలో వస్తాడు ఆ కరువు రాక్షసుడు. దేశంలో లేని కరువును సృష్టిస్తాడు. అన్నపూర్ణ అయిన ఈ దేశాన్ని ఆకలి చావులతో అలమటించేలా చేసి, ఇక్కడ పండిన ధాన్యపు రాశులను ఇంగ్లాండ్‌కు రవాణా చేసే పన్నాగం పన్నుతాడు. ఆ బ్రిటిష్ ఆకృత్యాల నుంచి రణబాలి తన ప్రజలను ఎలా రక్షించుకున్నాడు? ప్రజల ఆకలి తీర్చడానికి ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.

### విశ్లేషణ

చరిత్రలో మరుగునపడిపోయిన ఓ వీరుడి కథ ఇది. ఒక వ్యక్తి పోరాటం వెనుక ఉన్న ప్రజల బాధలను, ఆ కాలపు సామాజిక పరిస్థితులను ఆవిష్కరించడంతో పాటు, కథలో భాగంగా భద్రమల్లన్న జానపద గాథను దర్శకుడు మేళవించిన తీరు ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంటుంది. 'రణబాలి'లో ప్రధానంగా ఆకట్టుకునేది కథాంశం. దాని వెనుక ఉన్న మానవీయ కోణం. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులను దర్శకుడు కొన్ని సన్నివేశాల్లో హృదయానికి హత్తుకునేలా చూపించారు. కరువు కారణంగా ఆకలితో అలమటించే ప్రజలు, తమ కుటుంబాలను కాపాడుకోవడానికి వారు పడే తపన, జీవనం కోసం చేసే పోరాటం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తాయి. తెరపై కనిపించే సన్నివేశాలు, ప్రజల కన్నీళ్లు, వారి దుర్భర జీవితాలను ప్రతిబింబించే సన్నివేశాలు కథకు వాస్తవికతను తీసుకొస్తాయి. చరిత్రలోని ఒక చీకటి అధ్యాయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఈ చిత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తుంది. రణబాలి పుట్టుక, భద్రమల్లన్న నేపథ్యం, ఊర్లో జాతర, అక్కడ రణబాలిపై జరిగిన దాడి, తొలి యాక్షన్ ఘట్టం.. ఇవన్నీ ప్రేక్షకుడిని కథలో లీనం చేస్తాయి. జయమ్మ పాత్రలో రష్మిక పరిచయం, పెళ్లి తర్వాత వచ్చే సన్నివేశాలు హత్తుకునేలా ఉంటాయి. ఇంటర్వెల్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ తర్వాత కూడా కథ మరింత తీవ్రతతో సాగుతుంది. బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకున్న ఆహారాన్ని రణబాలి తిరిగి తీసుకొచ్చి ప్రజలకు అందించే ఎపిసోడ్‌లో అతని పోరాట స్ఫూర్తి మరో స్థాయిలో నిలుస్తుంది. ప్రీ క్లైమాక్స్‌లో వచ్చే ఎమోషనల్ సీన్స్ కదిలిస్తాయి. ఈ సన్నివేశాలు కథలోని మానవీయ భావోద్వేగాలను మరింత అందంగా ఆవిష్కరిస్తాయి. ఇక చివర్లో భద్రమల్లన్న స్వామి పాత్రను ఉపయోగించుకున్న తీరు థియేటర్లలో పూనకం తెప్పిస్తుంది.

### నటీనటుల నటన

రణబాలి పాత్ర విజయ్ దేవరకొండ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. నటుడిగా తనను మరో స్థాయిలో నిలబెట్టిన ప్రదర్శన కనబరిచారు. పాత్రలోని తీవ్రత, ఆవేశం, పోరాట స్ఫూర్తిని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగ సందర్భాల్లోనూ పాత్రకు పూర్తి న్యాయం చేశారు. రష్మిక జయమ్మ పాత్రలో సహజంగా కనిపిస్తూ మెప్పించారు. విజయ్ దేవరకొండతో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు అందంగా, హత్తుకునే భావోద్వేగాలతో సాగుతాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు మంచి ఆకర్షణగా నిలుస్తుంది. ఈశ్వరి రావు పాత్ర కథకు మరింత బలాన్ని తెచ్చింది. బ్రిటిష్ జనరల్ ఆర్నాల్డ్ వోస్లూ పాత్రలో కావాల్సిన క్రూరత్వం కనిపించింది. కథలోని సామాజిక, చారిత్రక నేపథ్యానికి అనుగుణంగా మిగతా పాత్రలు కూడా తమ వంతు సహకారం అందించాయి.

### టెక్నికల్ విభాగం

చరిత్రలో మరుగునపడిపోయిన ఒక వీరుడి కథను ఎంచుకోవడం, దాని వెనుక ఉన్న సామాజిక పరిస్థితులను తెరపైకి తీసుకురావడంలో రాహుల్ సాంకృత్యన్ అద్భుతమైన పనితీరు కనబరిచారు. ప్రజల బాధలు, తిరుగుబాటు స్ఫూర్తి, జానపద గాథ వంటి భిన్నమైన అంశాలను ఒకే కథలో చక్కగా మేళవించారు. కొన్ని భావోద్వేగ సన్నివేశాలను హృద్యంగా తెరకెక్కించడం ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులను సంభాషణలు, సంఘటనల ద్వారా వాస్తవానికి దగ్గరగా తీయడం అభినందనీయం. చారిత్రక నేపథ్యానికి తగిన నిర్మాణ విలువలతో సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. కెమెరా వర్క్ కూడా టాప్ క్వాలిటీతో ఉంది. ఎడిటింగ్ ఇంకాస్త పదునుగా ఉండొచ్చు. అలాగే, అజయ్--అతుల్ కొన్ని చోట్ల మరింత బలంగా నేపథ్య సంగీతాన్ని ఇచ్చే అవకాశాన్ని చేజార్చుకున్నారనిపించింది.

**ప్లస్ పాయింట్స్**

- బలమైన చారిత్రక కథాంశం
- విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ నటన
- విజయ్ దేవరకొండ--రష్మిక మందన్న సన్నివేశాలు
- ఇంటర్వెల్ సీక్వెన్స్, క్లైమాక్స్
- భావోద్వేగ ఘట్టాలు
- భద్రమల్లన్న జానపద గాథ

**మైనస్ పాయింట్స్**

- అక్కడక్కడా నెమ్మదైన కథనం
- నేపథ్య సంగీతం

ఫైనల్‌గా: చరిత్రలో జరిగిన సంఘటనలను కమర్షియల్ హిస్టారికల్ ఫిక్షన్‌గా మలిచిన తీరు ఆద్యంతం ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, రాహుల్ సాంకృత్యన్ కెరీర్లలో ఈ చిత్రం గుర్తుండిపోయే స్థానాన్ని సంపాదించుకుంటుంది. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించే అవకాశం పుష్కలంగా ఉంది.

**రేటింగ్: 3.5/ 5**

# రా అండ్ రస్టిక్ యాక్షన్ లవ్ స్టోరీతో రానున్న 'డానీ'.. నవంబర్ 13న గ్రాండ్ రిలీజ్!




టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ హీరో ఆశిష్ గాంధీ, టాలెంటెడ్ డైరెక్టర్ కళ్యాణ్‌జీ గోగణ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అంటెసిపేటెడ్ మూవీ 'డానీ'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'నాటకం' సినిమా ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు అదే జోరుతో అంతకుమించిన ఇంటెన్సివ్ కంటెంట్‌తో ఈ కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. రిజ్వాన్ ఎంటర్టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ పతాకాలపై ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్, క్రైమ్, రా అండ్ రస్టిక్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంపై ట్రేడ్ సర్కిల్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ స్ట్రైక్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. సినిమాలోని బోల్డ్ కంటెంట్, రా అండ్ రస్టిక్ మేకింగ్ స్టైల్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సాధారణ ప్రేమ కథలకు భిన్నంగా, మనిషి జీవితంలో ఉండే అలవాట్లకు, అతను మనసారా కోరుకునే ప్రేమకు మధ్య జరిగే భావోద్వేగ సంఘర్షణే ఈ చిత్రానికి ప్రధాన హైలైట్ కానుంది. ఓ వ్యక్తి తన జీవితంలో అలవాటు చేసుకున్న పద్ధతులు అతని గమ్యభావితాన్ని ఎలా మార్చాయి? ఆ వ్యక్తి నిజమైన ప్రేమలో పడిన తర్వాత తన జీవితంలో ఎలాంటి పెనుమార్పులు వచ్చాయి? ఈ రెండు విభిన్నమైన ధోరణుల మధ్య నలిగిపోయే పాత్రల ప్రయాణం ఎలా సాగిందనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమాను అత్యంత సహజంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఆశిష్ గాంధీ సరసన సేజల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తుండగా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మేకర్స్ తాజాగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. హీరో హీరోయిన్ల డిఫరెంట్ లుక్స్, పోస్టర్ డిజైన్ తీరు సినిమా నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతున్నాయి. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందిస్తున్న బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ, మణికాంత్ ఎడిటింగ్ బాధ్యతలు అద్భుతంగా నిర్వర్తించారు. కొల్లి గోపాల కృష్ణ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రానికి ఖుషి, సుధాకర్ గోద సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భార్గవ్ తోట ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, రామ్ సుంకర మరియు కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రఫీ అందించగా, సాయిరామ్ జల్లా కో-డైరెక్టర్‌గా సేవలందించారు. రిథమ్ స్టూడియోస్ సౌండ్ డిజైన్ చేయగా, కోటి వర్క్స్ పబ్లిసిటీ డిజైన్స్ అందించారు. సాయి సతీష్ పీఆర్వోగా వ్యవహరిస్తున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ రా అండ్ రస్టిక్ రొమాంటిక్ క్రైమ్ డ్రామా 'డానీ' సినిమాను ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 13న ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# 'కుంభ'లోని శక్తిని ఇప్పుడే తట్టిలేపాలని అనుకోవడం లేదు.. పృథ్వీరాజ్ బర్త్‌డేపై రాజమౌళి ట్వీట్

టాలీవుడ్ అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి' సూపర్‌స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా, తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి ఆయనకు సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పృథ్వీరాజ్ బర్త్‌డే సందర్భంగా రాజమౌళి చేసిన ట్వీట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో, అభిమానులలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే పృథ్వీ. ఈరోజు నీలోని 'కుంభ'ను తట్టిలేపాలని నేను అనుకోవడం లేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయడానికి తలరాతతో ముడిపడి ఉన్న కుంభ అతడు" అంటూ రాజమౌళి రాసుకొచ్చారు. 'కుంభ' అనేది 'వారణాసి' చిత్రంలో పృథ్వీరాజ్ పోషిస్తున్న పాత్ర పేరు కావడం విశేషం. ఈ చిత్రంలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా జోనాస్ నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ రోల్ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని సమాచారం.

# విజువల్ వండర్‌గా 'రామాయణం' కొత్త ట్రైలర్.. శ్రీరాముడిగా రణ్‌బీర్, రావణాసురుడిగా యశ్ అదుర్స్!



ఇండియన్ సినిమా చరిత్రలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న మైథలాజికల్ ప్రాజెక్ట్ 'రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' నుంచి మేకర్స్ కొత్త ట్రైలర్‌ను విడుదల చేశారు. హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ సరికొత్త ట్రైలర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దంగల్' వంటి ఇండస్ట్రీ హిట్ సినిమాలను అందించిన ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ రెండో ట్రైలర్ సినిమాపై అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించనుండగా, టాలీవుడ్ సెన్సేషన్ సాయి పల్లవి సీతాదేవి పాత్రలో అమాయకత్వంతో మెప్పించనున్నారు. ఇక రాకింగ్ స్టార్ యశ్ పవర్‌ఫుల్ రావణాసురుడి పాత్రలో భీకరంగా కనిపిస్తున్నాడు. ఇక ఈ చిత్రం మొదటి భాగం నవంబర్ 5, 2026న ప్రపంచవ్యాప్తంగా అట్టహాసంగా థియేటర్లలో విడుదల కానుంది. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ విడుదలవుతున్న ఈ చిత్రం ఇండియన్ సినిమా స్థాయిని గ్లోబల్ స్థాయిలో నిలబెడుతుందని తాజా ట్రైలర్ స్పష్టం చేస్తోంది.

# వెంకీ, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా.?



టాలీవుడ్ ప్రేక్షకులతో పాటు విక్టరీ వెంకటేశ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ సినిమా మరోసారి వాయిదా పడిన సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేశ్ కథానాయకుడిగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్ 47). ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, గతంలో పలుమార్లు విడుదల తేదీ మారిన ఈ చిత్రం, తాజాగా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా.. మరోసారి వాయిదా పడటం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సినిమా చివరి దశలో సాంకేతిక పనులు అనుకున్న సమయానికి పూర్తికాకపోవడంతోనే విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాత నాగవంశీ వెల్లడించారు.